భూమిలో పాతిపెట్టిన రూ. 5 లక్షలను చెదపురుగులు తినేశాయి



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 11 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 217 | పేజీలు:12 | వెల రూ.5

పిల్లాడి మంకు పట్టుతో ఆగిపోయిన విమానం




2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




# ఓకే చర్చిద్దాం

## విద్యార్థుల నిరసనలపై చర్చకు ఎట్టకేలకు ఒప్పుకున్న కేంద్రం

## సభలో అమిత్ షా మాట్లాడతారని రిజిజు ప్రకటన

**ఢిల్లీ, ఆగస్టు 10:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ఉద్యమించిన విద్యార్థులపై పోలీసుల అనుచిత తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటన చేశారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యలపై లోక్ సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై సమాధానం ఇస్తారని ప్రకటించారు. 'విద్యార్థుల నిరసనలపై సమగ్ర చర్చతోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర హోంమంత్రి దీనిపై స్పందిస్తారు. అయితే.. చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్షాలు ఎటువంటి అంతరాయం కలిగించవద్దు. హోం మంత్రి ...మిగతా 2లో

## మోడీ తీరు మారకుంటే పతనమే

సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్ ● అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు ● ఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో 7

## చర్చ లేకుండానే ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు ఆమోదం

**ఢిల్లీ, ఆగస్టు 10:** ట్రైబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ''ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లు-2026''కు లోక్ సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్ష ఎంపీల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ట్రైబ్యునళ్ల నియామకాల్లో పారదర్శకత, స్వతంత్రత, ఏకరూపతను తీసుకురావడంతో పాటు వాటి పనితీరులో సమర్థతను పెంచడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. బిల్లు 'నేషనల్ ట్రైబ్యునల్స్ కమిషన్' ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం ...మిగతా 2లో





వరుణయాగం విజయవంతం

# వర్షాలు విస్తారంగా కురవాలె.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలె

## పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు

**హైదరాబాద్, ఆగస్టు 10 (మనం బ్యూరో):** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం విజయవంతమైంది. వేద పండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ పవిత్ర వరుణ యాగంలో సీఎం రేవంత్ రెడ్డి, గీత దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగ క్రతువులను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమ గుండాలతో వరుణదేవుని అనుగ్రహాన్ని కాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి తీర ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఈ సందర్భంగా సీఎం దంపతులు ప్రార్థించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. ఒకవైపు ...మిగతా 2లో

...మరిన్ని వార్తలు, ఫోటోలు 5లో

## తెలంగాణ ఆశలపై చన్నీళ్లు

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదాకు నో 6

# ముగిసిన SIR




## మొత్తం ఓటర్లు 3,38,26,448

73,95,954 ఓట్ల గల్లంతు

78.14 శాతం డిజిటలైజేషన్ పూర్తి

యాదాద్రి భువనగిరి ఫస్ట్, హైదరాబాద్ లాస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 10, (మనం బ్యూరో):** రాష్ట్రంలో 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ప్రక్రియ సోమవారం ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల 448 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు తేల్చారు. సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లకు స్థానికతకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు ఇవ్వని 73, 95,954 మంది ఓటర్లకు ఓటర్ జాబితా నుంచి తొలగించినట్లు సమాచారం. కాగా, ఇప్పటి వరకు 2, 64, 494 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ...మిగతా 2లో

## అక్టోబర్ నుంచి రిఫార్మ్ ఉత్సవ్

కార్యక్రమ కార్యాచరణపై రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



2

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్రంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు

## ఇప్పటివరకు 8 లక్షల ఇండ్లు మంజూరు చేసినట్టు వెల్లడి

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కమలాపూర్, ఆగస్టు 10 (మనం ప్రతినిధి):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ ...మిగతా 2లో




## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్

దరఖాస్తు గడువు 15 వరకు పొడిగింపు 2

# చిట్టి గుండెకు నిమ్స్ అండ



- పైసా ఖర్చు లేకుండా గుండె శస్త్రచికిత్సలు
- లండన్ డాక్టర్ల బృందంతో కలిసి నిమ్స్ వైద్యుల 'మహా యజ్ఞం'
- ఎల్లుండే శ్రీకారం.. అపాయింట్ మెంట్ అవసరం లేదు
- నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్

**హైదరాబాద్, ఆగస్టు 10 (మనం న్యూస్):** పుట్టుకతోనే గుండె జబ్బులతో కొట్టుమిట్టాడుతున్న చిన్నారుల జీవితాల్లో హైదరాబాద్ నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) సరికొత్త సంజీవని కానుంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్న పీడియాట్రిక్ గుండె ఆపరేషన్లను పూర్తిగా ఉచితంగా అందించేందుకు నిమ్స్ సన్నద్ధమైంది. లండన్‌కు చెందిన అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా. రమణ తన్నుషనేని నేతృత్వంలోని అంతర్జాతీయ నిపుణుల బృందం, నిమ్స్ వైద్యులతో చేతులు కలిపింది. ఈ శస్త్రచికిత్సలను ఈ ...మిగతా 2లో

## మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

4.21 లక్షలకు పైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా

మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి 3

సైబర్ మోసాలకు చెక్..

## కొరియర్, లాజిస్టిక్స్‌కు 1601 సిరీస్ కేటాయింపు



7

## ప్రతి ఇంటా దేశభక్తి పరిమళించాలి

'హర్ ఘర్ తిరంగా'లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలె

మహా పురుషుల విగ్రహాలను శుద్ధి చేయండి

బీజేపీ శ్రేణులు, యువతకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా'ను రాష్ట్రమంతా విజయవంతం చేయాలని ...మిగతా 2లో

## ట్యాంక్‌బండ్‌లో టేకాఫ్.. ప్రకాశం బ్యారేజీలో ల్యాండింగ్

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సీ-ప్లేన్ సర్వీసులు

తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనపై కేంద్రం సానుకూలత

హుస్సేన్ సాగర్‌లో ఏఏఐ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

ఒక్కసారికి 9 నుంచి 12 మంది ప్రయాణించే వీలు

రెండు రాష్ట్రాల మధ్య పర్యాటకానికి కొత్త ఊపు 6

'అణు డిమాండ్' లేకుండానే ఇరాన్‌తో డీల్..

## ట్రంప్ యూటర్న్?



**వాషింగ్టన్, ఆగస్టు 10:** ఓవైపు తరిగిపోతున్న ఆయుధ నిల్వలు.. మరోవైపు మధ్యంతర ఎన్నికలు.. ఇటు ఇరాన్‌తో ఎంతకీ తెగని చర్చలు.. వీటన్నింటి మధ్య అమెరికాలో ట్రంప్ సర్కార్ నలిగిపోతోంది. పశ్చిమాసియాలో సుదీర్ఘ యుద్ధంతో లాభం కంటే నష్టమే ఎక్కువ కన్పిస్తుండటంతో సొంత దేశంలోనే అధ్యక్షుడు ట్రంప్‌నకు తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. దీంతో యుద్ధం నుంచి బయటపడేందుకు అగ్రరాజ్యం మార్గాలు వెతుకుతోంది. ఈ క్రమంలో ఆది నుంచి పట్టుబట్టిన 'న్యూక్లియర్ డీల్'ను సైతం పక్కనబెట్టేందుకు ట్రంప్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అణు అంశాలు లేకుండానే టెహ్రాన్‌తో ఒప్పందం చేసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ...మిగతా 2లో

## రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు

# రైలు మార్గం!



### భారత్‌కు 'వ్యూహాత్మక' రవాణా మార్గం కోసం మాస్కో యత్నాలు

**మాస్కో ,ఆగస్టు 10:** తమ దేశం నుంచి భారత్‌కు ఓ నూతన రవాణా మార్గాన్ని నిర్మించాలని రష్యా ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి హిందూ మహా సముద్రం వరకూ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. తద్వారా బోస్ఫోరస్ (తుర్కియే నియంత్రణలోని), హర్మూజ్ (ఇరాన్ అధీనంలోని) జల సంధి వంటి వ్యూహాత్మక సముద్ర రవాణా మార్గాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించాలని యోచిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదన చేశారు. ఇటీవల కాలంలో మధ్యాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'హిందూ మహా సముద్రానికి రైల్వే లైను అనుసంధానాన్ని అన్వేషించాలి. బోస్ఫోరస్, హర్మూజ్ జల సంధి మార్గాల్లో ముప్పు పరిస్థితుల కారణంగా తుర్కెమిస్థాన్, ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ నుంచి ప్రత్యామ్నాయ మార్గాలు అవసరం. భారత్‌ను అనుసంధానించే ఎటువంటి మార్గమైనా ఆమోదనీయమే' అని ఖుస్నులిన్ పేర్కొన్నారు. ఈ వివరాలను రష్యా అధికార వార్తా సంస్థ టాస్ వెల్లడించింది.

# డాల్ఫిన్ తుపాను బీభత్సం

## చైనాలో సురక్షిత ప్రాంతాలకు 10 లక్షల మంది

## 2,230 విమానాల రద్దు

**బీజింగ్, ఆగస్టు 10:** చైనా లో భారీ వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. శక్తివంతమైన డాల్ఫిన్ తుపాను తీరాన్ని తాకడంతో ఆ ప్రాంతం వణుకుతోంది. భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడటం, వరదలు పోటెత్తే ప్రమాదం ఉండటంతో ...మిగతా 2లో



# భూమిలో పాతిపెట్టిన రూ. 5 లక్షలను చెదపురుగులు తినేశాయి

**కోటా, ఆగష్టు 10:** ఒక రైతు దొంగలకు భయపడి రూ.5 లక్షలను భూమిలో పాతిపెట్టారు. అయితే ఆ ప్రదేశాన్ని మర్చిపోవడంతో ఏడాది పాటు అవి దొరకలేదు. చివరికి ఆ డబ్బు దొరికినప్పటికీ అప్పటికే చెదపురుగులు తినేశాయి. రాజస్థాన్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నెవాయి గ్రామ రైతు మంగిలాల్ ఏడాది కింద తన భూమి విక్రయించడంతో వచ్చిన రూ.5 లక్షలను ఓ సంచిలో మూటకట్టి వ్యవసాయ భూమిలో పాతిపెట్టారు. కొన్ని నెలల తర్వాత ఆ డబ్బు దాచిపెట్టిన స్థలం మర్చిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అదే విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పారు. దీంతో దాదాపు ఆరు ఎకరాలు ఉన్న పొలంలో పలుచోట్ల తవ్వి చూసినా దొరకలేదు. దానితో వారు ఆ సొమ్ముపై ఆశలొదిలేసుకున్నారు. అయితే, ఇటీవల విత్తనాలు వేయడానికి పొలం దున్నుతున్న సమయంలో డబ్బు సంచి బయటపడింది. కానీ, తెరిచి చూస్తే.. నోట్లను చెదపురుగులు తినేశాయి. వాటిలో స్వల్పంగా దెబ్బ తిన్న నోట్లను తీసుకొని ఆ కుటుంబం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను సంప్రదించగా నోట్ల పరిస్థితి చూసి వాటిని తీసుకునేందుకు బ్యాంకు అధికారులు నిరాకరించారు. దానితో వారు ఆసొమ్ముపై మరోసారి ఆశలొదిలేసుకుని ఇంటి బాట పట్టారు.

# పిల్లాడి మంకు పట్టుతో ఆగిపోయిన విమానం

**ఒట్టావా, ఆగష్టు 10:** ఓ చిన్నారి సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఏకంగా విమాన సర్వీరద్దయిన వింత ఘటన కెనడాలో జరిగింది. విక్టోరియా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పోర్టర్ ఎయిర్లైన్స్ విమానం టొరంటోకు వెళ్లడానికి సిద్ధమైంది. అయితే, టేకాఫ్ కు సిద్ధంగా ఉన్న సమయంలో విమానంలోని ఓ చిన్నారి సీటు బెల్ట్ పెట్టుకోకుండా సీటుపై నిల్చొని ఉండడాన్ని సిబ్బంది గమనించారు. పాప తల్లి, క్యాబిన్ సిబ్బంది కలిసి సీటు బెల్ట్ పెట్టడానికి కొన్ని నిమిషాలపాటు ప్రయత్నించారు. అయితే చిన్నారి ఎంతకూ వినకుండా ఏడుస్తూ.. మంకు పట్టు పట్టడంతో ఏమీ చేయలేకపోయారు. దానితో విమానాన్ని టేకాఫ్ చేయడం అసురక్షితమని భావించిన సిబ్బంది వారిని దించేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విమానం తిరిగి టర్మినల్కు వెళ్లింది. చిన్నారిని, వారి తల్లిదండ్రులను విమానం నుంచి దించేసి.. నిబంధనల ప్రకారం వారి ఫ్లైట్ ప్లాన్లను తిరిగి ఫైల్ చేసేసరికి రాత్రి 12:30 గంటలు దాటింది. ఆ సమయానికి రన్ వేను మూసివేయడంతో విమాన ప్రయాణాన్ని రద్దు చేశారు. దీంతో అందులోని ప్రయాణికులు రాత్రి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. మరునాడు వారిని అదే విమానంలో గమ్యస్థానాలకు తీసుకువెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది.

# 'డాల్ఫిన్' తుపాను బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

తీరప్రాంత నగరాల్లోని దాదాపు 10లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జెజియాంగ్ ప్రావిన్స్‌లో 1,500కు పైగా తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

షాంఘైలో గత 24 గంటల వ్యవధిలో దాదాపు 313 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గత 150 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వర్షపాతమని అధికారులు పేర్కొన్నారు. వందకు పైగా వీధులు జలమయం అవ్వడంతో ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు సూచించారు. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రధాన విమానాశ్రయాల్లో 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాల్లో రోడ్లు, రైలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చైనాలోని డాల్ఫిన్ తుపాను ప్రభావం తైవాన్, భారత్‌లపైనా పడే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. దీనివల్ల చైనా సరిహద్దుల్లో ఉన్న భారత భూభాగంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

చైనా తూర్పు తీరంలోని జెజియాంగ్ ప్రావిన్స్‌ను ఆదివారం మధ్యాహ్నం డాల్ఫిన్ తుపాను తాకింది. ఈ సంవత్సరం చైనాలో సంభవించిన తుపానుల్లో ఇది 13వది. దీంతో చైనా జాతీయ వాతావరణ సంస్థ అత్యున్నత స్థాయి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ తుపానువల్ల గాలులు ఒక సెకనుకు 42 మీటర్ల వేగంతో వీస్తున్నాయి. తుపాను కారణంగా షాంఘైలోని రెండు ప్రముఖ విమానాశ్రయాల్లో దాదాపు 2,230 విమానాలు రద్దయ్యాయి. హాంగ్‌జవ్ నగరంలోని విమానాశ్రయంలో రాకపోకలు సాగించాల్సిన దాదాపు 500 విమానాలు రద్దయ్యాయి.

## 'అణు డిమాండ్' లేకుండానే ఇరాన్ తో డీల్..

# ట్రంప్ యూటర్న్?

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా సంచలన కథనం ప్రచురించింది.ఇరాన్ ఎలాంటి షరతులు లేకుండా హర్మూజ్ జలసంధిని పూర్తిగా అందుబాటులోకి తెస్తే ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకుందామని ట్రంప్ తన సన్నిహిత వర్గాలకు ప్రైవేటుగా చెప్పినట్లు సమాచారం. అణు డీల్ లేకుండానే ఈ యుద్ధాన్ని ముగించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారట. శాంతి ఒప్పందం విషయంలో ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. మరోవైపు, పశ్చిమాసియాలో ఘర్షణలు ఎంతకాలమైనా కొనసాగించేందుకు టెహ్రాన్ సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ట్రంప్ అణు డీల్‌పై వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. హర్మూజ్ జలసంధిని తెరిచే విషయంలో ఇరాన్ తన డిమాండ్లను స్పష్టంగా చెబుతోంది. అమెరికా దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయడంతో పాటు ఈ ప్రాంతం నుంచి అగ్రరాజ్య దళాలు వెళ్లిపోవాలని టెహ్రాన్ డిమాండ్ చేసింది. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేవరకూ హర్మూజ్‌ను తెరవబోమని కరాఖండీగా చెప్పింది. ఇవన్నీ చర్చలకు అడ్డంకిగా మారాయి.

మరోవైపు, అమెరికాలో మధ్యంతర ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ ఏడాది నవంబరులో అక్కడ ఎన్నికలు జరగనున్నాయి. ఇక, హర్మూజ్‌లో నౌకల రవాణాకు అంతరాయం కొనసాగుతుండటంతో చమురు ధరలు దిగిరావట్లేదు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని యుద్ధం నుంచి బయటపడాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, బహిరంగంగా మాత్రం ఈ ఉద్రిక్తతలపై ట్రంప్ చేస్తున్న ప్రకటనలు భిన్నంగా ఉంటున్నాయి. తాజాగా ఓ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇరాన్‌తో చర్చల విషయంలో తొందరేం లేదు. మేం ప్రశాంతంగా ఉన్నాం. టెహ్రాన్‌లో ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. వారి వద్ద సరిపడా నగదు లేదు' అని వ్యాఖ్యానించడం గమనార్హం.

మరోవైపు, అమెరికాపై ఇరాన్ మళ్లీ తీవ్ర హెచ్చరికలు చేసింది. ఒకవేళ అగ్రరాజ్య సిబ్బంది తమ దేశంలో అడుగుపెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆ దేశ బ్రిగేడియర్ జనరల్ అలీ జహన్‌షాహీ హెచ్చరించారు. ప్రత్యర్థి చర్యలకు గట్టిగా బదులిస్తామన్నారు.

# అక్టోబర్ నుంచి రిఫార్మ్ ఉత్సవ్

**హైదరాబాద్, ఆగస్టు 10 (మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై కేంద్ర కేబినెట్ కార్యదర్శి డా. టీవీ సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సోమనాథన్ పేర్కొన్నారు.ఈ రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్‌లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. రెండో దశ అక్టోబర్-డిసెంబర్‌లో రిఫార్మ్ ఉత్సవ్‌గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్-జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నాట్టు స్పష్టంచేశారు.మూడో దశగా డిసెంబర్ 28,నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యల సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. సంబంధిత రాష్ట్ర శాఖలు, లైన్ డిపార్ట్‌మెంట్ల ద్వారా కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు సోమనాథన్ సీఎస్‌లకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ రిఫార్మ్ ఉత్సవ్ పోర్టల్‌ను ప్రారంభించనుంది. ఈ పోర్టల్లో ప్రజల భాగస్వామ్యం, సూచనల సేకరణ, సంస్కరణల పర్యవేక్షణకు అవకాశం కల్పించడంతో పాటు ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర, బి. పాపిరెడ్డి, లా సెక్రటరీ, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్,మహేష్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్,స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని పేర్కొన్నారు. సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి అన్నారు. గతంలో వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇండ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇండ్లను పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఇల్లు ఎవరు నిర్మించారన్నది కాకుండా, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను, ఇప్పటివరకు హైద్రాబాద్ తో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను మంజూరు చేసేనట్లు మంత్రి తెలిపారు. అనంతరం మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ పక్షపాతం చూపడం లేదని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం, మంత్రుల నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాకుండా, అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

ఇళ్ల నిర్మాణంతో పాటు లబ్ధిదారుల కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గత ప్రభుత్వాల హయాంలో పేదలకు పరిమిత సంఖ్యలో ఇండ్లు ఇచ్చిన పరిస్థితికి భిన్నంగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దశలవారీగా సుమారు 8 లక్షల ఇళ్లను మంజూరు చేసి పేదలకు అందించే దిశగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాబోయే దశల్లోనూ అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.

ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇండ్లు అనీ. పేదల ముఖాల్లో సంతోషం చూడటమే ప్రభుత్వ లక్ష్యం అని పొంగులేటి స్పష్టం చేశారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ:**

ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

> **గృహ ప్రవేశాలు..**
>
> అంతకు ముందు కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులతో మంత్రులు గృహప్రవేశం చేయించారు. అనంతరం ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రజలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న సూచనలు, విజ్ఞప్తులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ద్వారా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న లబ్ధిదారులందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. కమలాపూర్ మండలం, గూడూరు గ్రామంలో 50, మనేపల్లి గ్రామంలో కలిపి మొత్తం 394 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమవుతోందన్నారు. లబ్ధిదారులు ఇళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని మంత్రులను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ మాట్లాడుతూ**

కమలాపూర్ మండలంలో మొత్తం 394 డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల ద్వారా ధ్రువీకరించి ఎంపిక చేశామని తెలిపారు. తప్పుడు సమాచారం ద్వారా అనర్హులు ఎంపికైనట్లు తేలితే కేటాయింపును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారం రోజుల్లోగా ఇండ్లను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు.




# ముగిసిన 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ పూర్తయింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 డిజటలైజేషన్ నమోదైంది. సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లుగా సరైన ఆధారాలు సమర్పించిన వారి డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా ఎన్నికల అధికారులు దాదాపు ఇప్పటికే పూర్తి చేశారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆ తరువాతి స్థానాలలో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం ఉన్నాయి. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్ 27,74,687 ఎన్యుమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసి చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 63.82 శాతం రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది.రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగకపోవడం గమనార్హం. కాగా, రాష్ట్రంలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12 రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించనున్నట్లు సమాచారం. 17న ఓటర్ల ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి ఆ తవారుత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. రాష్ట్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారనేది జిల్లాల వారీగా అక్టోబర్ 19న తుది జాబితా విడుదల కానుంది.

## చర్చ లేకుండానే ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

వహించే ఈ కమిషన్లో ఛైర్ పర్సన్ తో పాటు ఇద్దరు న్యాయ, ఇద్దరు సాంకేతిక రంగ నిపుణులు సభ్యులుగా ఉంటారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ బిల్లు తీసుకువచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. కాగా, ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న 2021 నాటి ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం రద్దవుతుంది.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్

- ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఆగష్టు 10(మనం న్యూస్):** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు.ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌పై ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగించి ఈ నెల 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

# చిట్టి గుండెకు నిమ్స్ అండ

(మొదటి పేజీ తరువాయి)

నెల పదమూడో తేదీ నుంచి నిమ్స్ వేదికగా ప్రారంభం కానుందని ఆసుపత్రి డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్ వెల్లడించారు.గత ఐదు సంవత్సరాలుగా ఎంతోమంది చిన్నారుల గుండెల్లో నిండైన ఆశలు నింపిన ఈ ఉచిత శస్త్రచికిత్సల కార్యక్రమం ఈ ఏడాది కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం అధిపతి ప్రొ. అమరేశ్వర్ నేతృత్వంలోని స్థానిక వైద్య బృందం, లండన్ సాంకేతిక నిపుణులు సంయుక్తంగా ఈ క్లిష్టమైన ఆపరేషన్లను నిర్వహించనున్నారు. కార్పొరేట్ వైద్యం భారం కాలేక నిస్సహాయ స్థితిలో ఉన్న ఎన్నో నిరుపేద కుటుంబాలకు నిమ్స్ వైద్యుల చొరవ పెద్ద ఊరటగా మారనుంది.

**నో రెకమెండేషన్స్:** ఈ చికిత్సల కోసం తల్లిదండ్రులు ఎలాంటి ముందస్తు రిజిస్ట్రేషన్లు లేదా సిఫార్సుల కోసం తిరగాల్సిన అవసరం లేదని, నేరుగా ఆసుపత్రికి వచ్చే వాక్-ఇన్ విధానంలోనే చిన్నారులను నిపుణులు పరిశీలిస్తారని దేవరాజ్ ఉద్ఘాటించారు. రోగుల ఆరోగ్య తీవ్రత, అత్యవసర పరిస్థితిని బట్టి ప్రాధాన్యత క్రమంలో వైద్యులు పిల్లలను ఎంపిక చేస్తారని,ప్రాథమిక తనిఖీల అనంతరం అవసరమైన అన్ని వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, శస్త్రచికిత్స తప్పనిసరి అనుకున్న వారికి డేట్లు ఖరారు చేస్తారని ఆయన వివరించారు. అర్హత ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు సోమవారం నుంచి శనివారం వరకు, ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల లోపు హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రి పాత బ్లాక్ మొదటి అంతస్తులో ఉన్న సీటీ సర్జరీ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చునని, మరింత సమాచారం కోసం 040-2348-9025 నంబర్ లో సంప్రదించవచ్చని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చిన్నారులను తీసుకువచ్చే సమయంలో వారికి గతంలో నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలు, పాత ప్రిస్క్రిప్షన్లు అందుబాటులో ఉంటే తప్పనిసరిగా వెంట తీసుకురావాలని నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్ సూచించారు.రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద తల్లిదండ్రులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ఓకే చర్చిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనకు ఆటంకం కలిగించేలా గందరగోళం సృష్టించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి. చర్చ సమగ్రంగా సాగేలా సహకరించాలి. ఈ మేరకు ప్రతిపక్షాలు హామీ ఇవ్వాలి' అని కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. జులై 20న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు తొలుత నీట్ పేపర్ లీక్ పై, అయోధ్య రామ మందిరంలో విరాళాల అవకతవకలపై నిరసన తెలిపాయి. ఆ తర్వాత.. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చకు పట్టుబడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రధాని మోడీ,కేంద్ర హోంమంత్రి సభకు హాజరు కావాలని, ఈ అంశాలపై ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

# ప్రతి ఇంటా దేశభక్తి పరిమళించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లో తన ఇంటి వద్ద జాతీయ జెండాను సోమవారం ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

**'తిరంగా యాత్ర'ను విజయవంతంగా నిర్వహిద్దాం..**

దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా'ను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.మహా పురుషుల విగ్రహాలను శుద్ధి చే(ద్దాం)యండి..

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12 నుంచి 14 తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే గొప్ప సామాజిక ఉద్యమంగా రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు.

'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా.. ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూసి 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బండి సంజయ్ కోరారు.

# వర్షాలు విస్తారంగా కురవాలె.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలె





(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళుతూనే వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహావరుణ యాగాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి, కృష్ణా-గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలనీ, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి వరుణ దేవుడిని ప్రార్థించారు.

ప్రతి ఇంటా దేశభక్తి చాటుదాం

దేశ ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పేందుకే

# హర్ ఘర్ తిరంగా

**వానాకాలం అయిపోయాక రేవంత్ కొత్త నాటకం**

**ఎల్ నినో ఉందని సీఎంకు తెలియదా?**

**కోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదు?**

**రేవంత్ సర్కార్‌పై బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ధ్వజం**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామని.. పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

అనంతరం నాంపల్లిలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో సోమవారంనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఆయన మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గూల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణయాగం చేస్తే.. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామన్నారు. వానాకాలం అంతా అయిపోయాక రేవంత్ రెడ్డిది ఇదో కొత్త నాటకమంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎల్ నినో ఉన్న విషయం సీఎంకు తెలియదా అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

# సరిహద్దు సవాళ్లకు 'సాంకేతిక' సమాధానం

**అత్యాధునిక టెక్నాలజీతోనే దేశ రక్షణ బలీయం**

**ఇంజనీరింగ్ సిబ్బందికి కొత్త నైపుణ్యాలు అత్యవసరం**

**'ఆస్కీ' ఆధ్వర్యంలో 7 దేశాల ప్రతినిధులతో శిక్షణ ప్రారంభం**



**హైదరాబాద్,ఆగష్టు 10(మనం న్యూస్):** దేశ సరిహద్దుల్లో అత్యంత సంక్లిష్టమైన, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ వ్యూహాత్మక రహదారులు, వంతెనలు, సొరంగ మార్గాలను నిర్మించే బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) ఇంజనీర్ల పాత్ర దేశ భద్రతలో అత్యంత కీలకమైనదని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కీ) డైరెక్టర్ కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ స్పష్టం చేశారు. ఆధునిక కాలంలో సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఇంజనీర్లు తమ నైపుణ్యాలను నిరంతరం పదును పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఆస్కీ క్యాంపస్‌లో భారత సరిహద్దు దేశాలైన బంగ్లాదేశ్, చైనా, నేపాల్, మయన్మార్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సివిల్ ఇంజనీర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. 'టెస్టింగ్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ మెటీరియల్స్ బై యూసింగ్ లేటెస్ట్ టెక్నిక్స్' అనే అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు గ్రేవల్ తెలిపారు. ఈ సందర్భంగా కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ మాట్లాడుతూ, భారత సైన్యంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలు అందించిన అనుభవంతో చెప్తున్నానని.. వ్యూహాత్మక సైనిక నిర్మాణాల్లో నాణ్యత, వేగం, భద్రత అత్యంత ప్రధానమైన అంశాలని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో పనిచేసే ఇంజనీర్లు అత్యాధునిక టెక్నాలజీని విధిగా వినియోగించుకోవాలని సూచించారు.

**హరిత విద్యుత్ ప్రాజెక్టులు:**

ఇదే వేదికపై నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపొందించిన నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కూడా డైరెక్టర్ ప్రారంభించారు. విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురయ్యే సామాజిక, పర్యావరణ సమస్యలను సమర్థవంతంగా ఎలా అధిగమించాలనే అంశంపై ఈ శిక్షణ సాగనుంది. ముఖ్యంగా నేపాల్‌లోని కొండ ప్రాంతాల్లో గాలి, నీరు, నేల కాలుష్యం కాకుండా కాపాడుకుంటూ, జీవవైవిధ్యాన్ని దెబ్బతీయకుండా విద్యుత్ ఉత్పాదన మరియు నిర్వహణను ఎలా చేపట్టాలో అంతర్జాతీయ నిపుణులచే అవగాహన కల్పిస్తున్నట్లు హర్ పాల్ వివరించారు. అలాగే మరో కార్యక్రమంలో భాగంగా, షెల్ ఇండియా ఇంజనీర్ల కోసం ఏర్పాటు చేసిన గ్యాస్ టర్బైన్‌లు, కంప్రెసర్ల పనితీరు, నిర్వహణపై శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ అంతర్జాతీయ స్థాయి శిక్షణలో మలేషియాకు చెందిన సిటీ ఫైదతుల్ అసోసియేట్ కంపెనీ ఇంజనీర్లు మిస్ రామోస్, బహారుద్దీన్ ముహమ్మద్ నబిల్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన 70 మందికి పైగా షెల్ కంపెనీ ప్రతినిధులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

**విశ్వనగరాన్ని వీక్షించండి:**

హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన విశ్వ నగరమని కల్నల్ హర్ పాల్ సింగ్ గ్రేవల్ కొనియాడారు. చార్మినార్, గోల్కొండ కోట వంటి ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలతో పాటు అద్భుతమైన హోటళ్ళు, రెస్టారెంట్లు ఈ నగర ప్రత్యేకతలని అన్నారు. ఐదు రోజుల శిక్షణ అనంతరం లభించే తీరిక సమయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ సంస్కృతిని, చారిత్రక ప్రదేశాలను సందర్శించి ఆస్వాదించాలని ఆయన అతిథులను కోరారు. ప్రారంభోత్సవ సభలో సివిల్ ట్రాన్స్పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వెంకట్ రెడ్డి, మేనేజ్ మెంట్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ యు.ఎస్. జ్యోతి, ఎం. సునీత, ఎస్. విజయకుమార్‌లతో పాటు పాల్గొన్నారు.

# ఐటీఆర్ రిఫండ్ ఆలస్యంపై.. నిర్దిష్ట గడువు?

**సాధారణంగా రెండు నుంచి ఆరు వారాల సమయం**

**ఈ-వెరిఫికేషన్ వెంటనే పూర్తి చేయాలి**

**ఫామ్ 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్ వివరాలు సరిపోలాలి**

**బ్యాంకు ఖాతా ప్రీ-వాలిడేట్ చేసి ఉండాలి**

**ఆలస్యమైతే ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో స్టేటస్ చూడాలి**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేశారా? అయితే రిఫండ్ ఎప్పుడు ఖాతాలో పడుతుందా? అని ఎదురుచూస్తుంటారు. అయితే రిఫండ్ జమ కావడానికి ఆదాయపు పన్ను శాఖ నిర్దిష్ట గడువు ఏదీ విధించలేదు. ఆర్థిక నిపుణుల ప్రకారం.. ఐటీఆర్‌లో ఎలాంటి తప్పులు లేకుండా దాఖలు చేసి, వెంటనే ఈ-వెరిఫికేషన్ పూర్తి చేస్తే సాధారణంగా రెండు నుంచి ఆరు వారాల్లో రిఫండ్ అందే అవకాశం ఉంది.

రిఫండ్ త్వరగా రావాలంటే ఐటీఆర్‌లో ఇచ్చిన వివరాలు సరిగ్గా ఉండటం చాలా ముఖ్యం. ఆదాయం, టీడీఎస్ వివరాలు ఫామ్ 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్‌తో సరిపోలాలి. బ్యాంకు ఖాతాను ముందుగానే ప్రీ-వాలిడేట్ చేసి ఉండాలి. రిటర్న్ దాఖలు చేసిన వెంటనే ఈ-వెరిఫికేషన్ పూర్తి చేయడం కూడా కీలకమే. వివరాల్లో చిన్న తేడా ఉన్నా అదనపు పరిశీలనకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో రిఫండ్ ఆలస్యం కావచ్చు. ఐటీఆర్‌ను గడువు కంటే ముందే దాఖలు చేస్తే రిఫండ్ త్వరగా వస్తుందన్న హామీ ఏమీ ఉండదు. అయితే రిటర్న్ ప్రాసెసింగ్ క్యూలో ముందుగా చేరే అవకాశం ఉంటుంది. ఏదైనా తప్పు తేలితే దాన్ని సరిచేసుకునేందుకు కూడా ఎక్కువ సమయం దొరుకుతుంది.

రిఫండ్ ఇంకా రాకపోతే ముందుగా ఆదాయపు పన్ను ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో రిటర్న్, రిఫండ్ స్టేటస్ చెక్ చేయాలి. బ్యాంకు ఖాతా ప్రీ-వాలిడేట్ అయిందో.. లేదో.. పరిశీలించాలి. ఆ ఖాతాకు పాన్ అనుసంధానం ఉందో కూడా చూడాలి. ఆదాయపు పన్ను శాఖ నుంచి ఏదైనా నోటీసు లేదా సమాచారం వచ్చిందా అనేది చెక్ చేసి, అవసరమైతే వెంటనే స్పందించాలి. అన్నీ సరిగ్గా ఉన్నా రిఫండ్ పెండింగ్‌లో ఉంటే అధికారిక పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. రిఫండ్ ఆలస్యమైన కొన్ని సందర్భాల్లో వడ్డీ కూడా లభిస్తుంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 244ఏ కింద అర్హత ఉన్న రిఫండ్లకు వడ్డీ చెల్లించే నిబంధన ఉంది. నిబంధనలకు లోబడి సాధారణంగా నెలకు 0.5 శాతం చొప్పున సాధారణ వడ్డీ లభించే అవకాశం ఉంటుంది.

# ఫోర్త్ సిటీలో సీఎం తమ్మునికి ఉచితంగా 5 ఎకరాలు జాగ

**ట్రెజరాక్ట్ అడ్వాన్స్ సిస్టం కంపెనీ పేరుతో షెల్ కంపెనీ ఏర్పాటు**

**కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాంగ్రెస్ సర్కార్ మూడేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు?.. కుంభకోణాలు తప్ప.. ఫోర్త్ సిటీ పేరుతో విచ్చల విడిగా ముఖ్యమంత్రి పెద్ద భూ కుంభకోణానికి పాల్పడ్డారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నల్ల ధనాన్ని విదేశాలకు పంపి దాన్ని తెల్లగా మార్చుకోవాలని కుట్ర చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ట్రెజరాక్ట్ అడ్వాన్స్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో అనుముల కొండల్ రెడ్డి షెల్ కంపెనీ ఏర్పాటు చేశారని.. కేవలం లక్ష రూపాయలతో ఒక చిన్న ఇంట్లో ఈ కంపెనీ పెట్టారన్నారు. ఈ కంపెనీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సిస్టమ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ చేస్తుంది. ఏరో స్పేస్ డిఫెన్స్ సిస్టమ్ ప్రొడక్షన్ చేయాలంటే లైసెన్స్ ఉండాలి? కానీ, ఈ కంపెనీకి లైసెన్స్ లేదు . ఈ కంపెనీ ఏమీ మ్యానుఫ్యాక్చరింగ్ చేయకపోయినా రూ. కోటి ఫారిన్ ఎక్స్ చేంజ్ ఎర్నింగ్స్ వచ్చాయన్నారు. అయితే, అసలు ఈ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేకుండా పటాన్ చేరువులోని శ్రీకృష్ణ నగర్‌లో ఒక ఇంట్లో నడిపిస్తున్నారన్నారు. ఈ కంపెనీ షేర్ల విలువ కూడా కేవలం రూ. లక్ష మాత్రమేనన్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి సొంత తమ్ముని కంపెనీకి ఫోర్త్ సిటీలో 5 ఎకరాలు కేటాయించారని క్రిశాంక్ ఆరోపించారు. వందల కోట్ల విలువైన భూమిని, మార్కెట్ ధరకు అత్యంత చౌకగా రేవంత్ ప్రభుత్వం ఆయనకు కట్టబెట్టిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ కుటుంబ సభ్యులకు ఫోర్త్ సిటీ భూములు కట్టబెడుతున్నారు. దీనిపై సీఎం తన పదవి నుంచి వైదొలగి విచారణ జరిపించాలన్నారు. బీజేపీ నేతలు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుంది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్నారు. భూముల కేటాయింపు రద్దు చేయాలని.. సీఎం వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరులో ఘనంగా బోనాల పండుగ**



**పటాన్ చెరు, ఆగస్టు 10(మనం న్యూస్):** ఆషాఢ మాసం బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం పటాన్ చెరు పట్టణంలోని వివిధ కాలనీలలో గల అమ్మవారి దేవాలయాలు, గ్రామ దేవతల ఆలయాలను పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు. ఆషాఢ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. పండుగ సందర్భంగా కాలనీల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.బండలగూడ బోనాల పండుగలో పాల్గొన ఎమ్మెల్యే జీఎంఆర్.. ఆషాడమాసం బోనాల పర్వదినం పురస్కరించుకొని సోమవారం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండలగూడలో గల అమ్మవారి దేవాలయాలను ఎమ్మెల్యే గూడెం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, విక్రమ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

**4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా**

**మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత**

**మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్,ఆగష్టు10,(మనం న్యూస్):** రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టంచేశారు.

# సాగుకోసం రైతులు ఎదురుచూస్తుండ్రు?

**కాళేశ్వరం మోటార్లు ఆన్‌చేయండి**

**మంత్రి ఉత్తమ్‌కి హరీష్ రావు లేఖ**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రైతులను అదుకునేందుకు తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి అన్నధాతల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందేళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్ నినోతో తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. నీళ్లు లేక, వర్షాలు రాక.. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ ఇక నుంచి మరింత సులభం

**గ్రేటర్‌లో జనన, మరణాల నమోదుకు కొత్త ఆన్‌లైన్ పోర్టల్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవాసుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది.

ఇక, ఇదే అంశంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో సోమవారం కీలక సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి.

ఒకటి నుంచి రెండేళ్లలోపు జాప్యం జరిగితే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటితే మాత్రం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి మాత్రమే ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. ఈ కఠిన నిబంధనల దృష్ట్యా, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడటంలో జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టనున్న 'సీఆర్ఎస్' పోర్టల్ కీలక పాత్ర పోషించనుంది.

# ప్రజల గుండెల్లో పెద్ది పదిలం

**ఎంతకాలం బతికినం అన్నది కాదు?.. ఎట్లా బతికామన్నదే గుర్తుంటది**

**సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్**

**దివంగత నేతకు కేటీఆర్, హరీశ్ సహ బీఆర్ఎస్ నేతల ఘన నివాళి**



**హైదరాబాద్/నల్లబెల్లి, మనం ప్రతినిధి :** దివంగత బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభ వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం జరిగింది. ఈ సంతాప సభలో పెద్ది రాజకీయ ప్రస్థానం, తెలంగాణ ఉద్యమం, పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యేగా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి, పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. ఈ సంస్మరణ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావులు హజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనను స్మరించుకొని సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, 'ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు' అని వ్యాఖ్యానించారు. నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్న తీరు ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.

**పెద్ది విగ్రహాన్ని ప్రతిష్ఠించిన బీఆర్ఎస్ నేతలు.. అడ్డుకున్న పోలీసులు:**

తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రాహవిష్కరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విగ్రహ నిర్మాణ గద్దెను కూల్చి వేతను నిరసిస్తూ నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగారు. నర్సంపేటలో విగ్రహాన్ని ఏర్పాటుగా చేయగా అక్కడకు చేరుకున్న పోలీసులు విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారు. ప్రైవేట్ భూమిలో విగ్రహం ఏర్పాటు చేసుకుంటే మీకేంటని బీఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు. లీగల్‌గా వెళ్తామంటూ పోలీసులను హెచ్చరించడంతో దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు గద్దెను కూల్చివేశారని పెద్ది అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు సహ, శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు హాజరై పెద్ది సుదర్శన్రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిశ్శబ్దం

ఎవరి నిశ్శబ్దం కూడా
అర్థరహితమైనది కాదు
బలహీనత అంతకంటే కాదు!
ఒక సన్నద్ధత కోసం
మూల్యాంకనంలో లీనమైపోవడం
శక్తియుక్తులను కూడ తీసుకోవడం!

గాయపడ్డ వాని మౌనం
కంటికి కనిపించేదాకా
ఉప్పొంగని లావానే!
రెచ్చగొట్టు మాటలకు
స్పందించడం లేదంటే
వేటగాడు తెలివైన వాడుని అర్థం!

సమూహాలను చూసుకొని
మీసం మెలేసి తొడలు చర్చొద్దు
అవన్నీ గోడ మీది పిల్లులే!
కనుమరుగయ్యే కాలం వస్తే
జట్లన్నీ తారుమారై
నీ రహస్యాలన్నీ గుట్టు విప్పుతాయి!

అవకాశమున్నప్పుడన్నా
పేదల పెన్నిధై వెలగకపోతే
నీ దీపం కొండెక్కక మానదు!
చరిత్ర చెప్పే పాఠం ఒకటే
ప్రజాగ్రహం ముందు
ఎవరి విజయాలు శాశ్వతం కావు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# గ్రామీణ ఉపాధికి ఆర్థిక గ్రహణం..!



కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన నూతన ఆర్థిక నిబంధనలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక కీలకమైన సామాజిక సంక్షేమ పథకంలో పెద్ద ఎత్తున వ్యయాన్ని పంచుకోవాలని కేంద్రం కోరడం రాష్ట్ర ప్రభుత్వాలకు మింగుడుపడని అంశంగా తయారైంది. ముఖ్యంగా శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం కోసం రకరకాల ఉచిత హామీలు గుప్పించి, ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న రాష్ట్రాలకు ఈ నిర్ణయం ఒక పెద్ద సవాలుగా మారింది. ఫలితంగా, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలు కేంద్ర నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైనప్పటి నుండి 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ప్రస్తుతం 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్-(గ్రామీణ్'గా వ్యవహరిస్తున్నది) పూర్తిగా కేంద్ర నిధులతోనే నడిచింది. 2006లో యుపిఏ ప్రభుత్వం దీనిని ప్రారంభించిన మొదటి పదేళ్లు, ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కూడా కూలీల వేతనాలకు సంబంధించిన పూర్తి ఖర్చును యూనియన్ బడ్జెట్ నుంచే సమకూర్చాయి. కానీ నూతన మార్పుల ప్రకారం, ఒక రాష్ట్రానికి ఉపాధి కల్పన కోసం రూ. 100 కోట్లు అవసరమైతే, అందులో రూ. 60 కోట్లు మాత్రమే కేంద్రం ఇస్తుంది. మిగిలిన రూ. 40 కోట్లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే తమ సొంత బడ్జెట్ నుంచి కేటాయించాలి. కేవలం హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిని, శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు పూర్తి నిధులను మినహాయింపుగా ఉంచారు.

ఈ నిర్ణయం వల్ల కేవలం ప్రతిపక్ష రాష్ట్రాలే కాకుండా, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా అంతర్గతంగా ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నాయి. పరిమితంగా ఉండే రాష్ట్రాల రాబడిలో ఇంత పెద్ద మొత్తాన్ని ఒకే పథకానికి కేటాయించాల్సి రావడం వల్ల ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరవడే పరిస్థితి ఏర్పడింది. బహిరంగంగా విమర్శించలేక పోయినా, బీజేపీ పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా తమ పరిమితుల మధ్య మౌనంగానే సతమతమవుతున్నారు. వనరుల పంపిణీలో తమకున్న పరిమితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం సేకరించే పన్నుల్లో తగిన వాటా ఇవ్వకపోవడం, పైగా పథకాల భారాన్ని రాష్ట్రాలపై మోపడం న్యాయం కాదని అంతర్గత చర్చల్లో భావిస్తున్నారు. మరోవైపు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పంజాబ్, జార్ఖండ్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు మాత్రం కేంద్ర నిర్ణయాన్ని బహిరంగంగానే తీవ్రంగా ఖండిస్తున్నాయి.



ఈ వ్యతిరేకతకు కేవలం రాజకీయ కారణాలే కాకుండా సామాజిక, ఆర్థిక మూలాలు కూడా ఉన్నాయి. రాజకీయంగా చూస్తే, ఇది కాంగ్రెస్ హయాంలో వచ్చిన పథకం కావడం, బీజేపీ దీని ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. సామాజిక కోణంలో పరిశీలిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో సరైన పని దొరకని పేద రైతులు, వ్యవసాయ కూలీలకు ఇది ఒక ప్రాథమిక జీవనాధారంగా, ఆదాయ భద్రతగా మారింది. గ్రామాల్లో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు లేదా వ్యవసాయ పనులు లేని సీజన్‌లో ఈ పథకమే కోట్లాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. ఇక ఆర్థికపరంగా, ఈ పథకం ఇచ్చే దినసరి కూలీ గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలకు ఒక కనీస ప్రామాణికంగా పనిచేస్తోంది. ఈ పథకం అందుబాటులో ఉండటం వల్ల కూలీలు అతి తక్కువ వేతనాలకు పని చేయాల్సిన దుస్థితి తప్పింది. ఒకవేళ ఈ పథకం బలహీనపడితే గ్రామీణ వేతనాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది.

రాష్ట్రాల ఆర్థిక మంత్రులు తమ బడ్జెట్ ప్రసంగాల్లో ఈ నిబంధనల మార్పును తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉపాధి హామీని కేవలం ఒక పథకంగా కాకుండా పౌరుల ఉపాధి హక్కుగా అభివర్ణిస్తూ, గత రెండు దశాబ్దాలుగా ఇది గ్రామాల్లో నిశ్శబ్ద విప్లవం తెచ్చిందని గుర్తుచేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గ్రామీణ కార్మికుల హక్కులను, సమాఖ్య వ్యవస్థలోని వికేంద్రీకరణ సూత్రాలను కాపాడేందుకు న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు కూడా కేంద్ర వైఖరి గ్రామీణ పేదల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. నిధుల కేటాయింపును తగ్గించడం అంటే రాజ్యాంగం ప్రసాదించిన అధికార వికేంద్రీకరణ భావనకు విఘాతం కలిగించడమేనని స్పష్టం చేశాయి.

ఈ నిరసనలు, విమర్శలు ఎలా ఉన్నప్పటికీ, ఆచరణలోకి వచ్చేసరికి ప్రతిపక్ష రాష్ట్రాలు సైతం వాస్తవ రాజకీయ పరిస్థితిని అంగీకరించక తప్పలేదు. కేంద్రం నిబంధనలు మార్చినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరపు బడ్జెట్లలో రాష్ట్రాలు ఈ పథకానికి నిధులు కేటాయించక తప్పలేదు. తమిళనాడు ప్రభుత్వం రూ. 5,057 కోట్లను కేటాయించి, తన 40 శాతం వాటాను నిలబెట్టుకోవడమే కాకుండా, అదనంగా మరో రూ. 100 కోట్లు వెచ్చించింది. ఉపాధి అవకాశాలను 150 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కర్ణాటక, తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా తమ బడ్జెట్‌లో సరిగ్గా 40 శాతం వాటా నిధులను కేటాయించాయి. కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు మొదటి విడతగా కొంత మొత్తాన్ని కేటాయించి, సంవత్సరం చివరినాటికి మిగిలిన నిధులను భరిస్తామని తెలిపాయి.

కేంద్రంపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ రాష్ట్రాలు ఈ పథకానికి భారీగా నిధులు కేటాయించడానికి బలమైన కారణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, పేదల జీవన ప్రమాణాలను స్థిరంగా ఉంచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ఉపాధి భద్రతతో పాటు ఆర్థిక నిలకడను ఇచ్చే ఇటువంటి పథకాన్ని నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం చెలరేగే అవకాశం ఉంది. అందుకే, ఎంత ఆర్థిక భారం పడు తున్నప్పటికీ, కేంద్ర విధానాలతో విభేదిస్తూనే రాష్ట్రాలు తమ వంతువాటాను కేటాయించి ఉపాధి హామీని ముందుకు తీసు కెళ్తున్నాయి. సమాఖ్య వ్యవస్థలో సంక్షేమ పథకాల నిధుల భారాన్ని రాష్ట్రాలపై నెట్టడం శ్రేయస్కరం కాదు. కేంద్రం కూడా ఈ క్షేత్ర స్థాయి వాస్తవాలను గుర్తించి, తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# పుస్తక సేవకుడు రాజేశ్వరరావు



అక్షరం సమాజ పరిణామానికి మూల స్తంభం. 'పుస్తకం మనిషిని జ్ఞానవంతుడిగా మాత్రమే కాదు, చైతన్యవంతమైన పౌరుడిగా తీర్చిదిద్దే అద్భుత సాధనం' అనే సత్యాన్ని అణువణువునా విశ్వసించి, తన జీవితాంతం పఠన సంస్కృతి వ్యాప్తికే అంకితమైన విలక్షణ వ్యక్తిత్వం రాజేశ్వరరావుది. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులలో అగ్రగణ్యుడిగా, మూడు తరాల పుస్తక ప్రియులకు సుపరిచితమైన అక్షర సేవకుడిగా ముద్ర వేసుకున్న రాజేశ్వరరావు (75) అస్తమయం తెలుగు ప్రచురణ, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తీరని లోటు. ఆయన భార్య జ్యోతిర్మయి, కుమార్తెలు శైలజారావు, గౌతమిలతో కూడిన ఆయన కుటుంబానికి ఈ భౌతిక దూరం వర్ణనాతీతమైన వేదనను మిగిల్చినప్పటికీ, ఆయన అందించిన సాహిత్య సేవ సమాజంలో నిరంతరం ప్రకాసిస్తూనే ఉంటుంది.

1951లో ఆంధ్రప్రదేశ్లోని అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని చీమలవాగుపల్లెలో వెంగమ నాయుడు, నారాయణమ్మ దంపతులకు జన్మించిన ఆయన, అత్యంత సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి ఉద్భవించి, స్వీయ క్రమశిక్షణ, శ్రమశక్తితో మహావృక్షమై పఠనాభిలాషులకు నీడనిచ్చారు.

రాజేశ్వరరావు పుస్తక బంధం ఒక వృత్తిగా ప్రారంభమై, కాలక్రమంలో ఒక బృహత్తర సామాజిక ఉద్యమంగా పరిణామం చెందింది. 1976లో విజయవాడ విశాలాంధ్ర ముద్రణాలయంలో పుస్తకాలు ప్యాక్ చేసే అత్యంత సాధారణ ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన, పనిపట్ల అంకితభావం, నిబద్ధతలతో అంచెలంచెలుగా ఎదిగి ఆ సంస్థ జనరల్ మేనేజర్ స్థాయిని అధిరోహించారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విశాలాంధ్ర సంస్థతో ఆయనకు ఉన్న అనుబంధం కేవలం ఉద్యోగానికి పరిమితం కాలేదు; పుస్తక ముద్రణ, పంపిణీ, అక్షర ప్రచారంపై ఆయనకు లోతైన అవగాహనను కల్పించింది. విజయవాడలో ప్రసిద్ధ విజయవాడ పుస్తకోత్సవం ప్రారంభమై విజయవంతంగా రూపుదిద్దుకోవడంలో ఆయన నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకమైనది. ప్రచురణ రంగంలోని అనుభవంతో ఆయన 'ప్రగతి పబ్లికేషన్'ను స్థాపించి, విలువైన సాహిత్య గ్రంథాలను వెలువరించి రచయితలకు, పాఠకులకు మధ్య బలమైన వారధిగా నిలిచారు.

పుస్తకాన్ని నాలుగు గోడల గ్రంథాలయాల పరిధి దాటించి, పాఠకుడి ఇంటి గడప ముందుకు తీసుకెళ్లాలనే తపనతో హైదరాబాద్లో పుస్తక ప్రదర్శనల సంస్కృతికి నాంది పలికిన ప్రముఖులలో రాజేశ్వరరావు ప్రథములు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీకి తొలి కార్యదర్శిగా, ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ, వరుసగా 36 జాతీయ పుస్తక ప్రదర్శనల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. 2024లో జరిగిన 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన సందర్భంగా కూడా నిర్వాహకులు ఆయనను 'బుక్ ఫెయిర్ వ్యవస్థాపకుడిగా' అధికారికంగా గౌరవ పూర్వకంగా ప్రస్తావించడం ఆయన సుదీర్ఘ సేవలకు మకుటాయమానం. తొలినాళ్లలో కొద్దిమంది సాహిత్యాభిమానులకు మాత్రమే పరిమితమైన ఈ పుస్తక మేళా, నేడు లక్షలాది మంది సందర్శకులను ఆకర్షించే బృహత్ సాంస్కృతిక వేదికగా రూపాంతరం చెందింది. ఈ ప్రదర్శనల గణాంకాలు గమనిస్తే, 36వ జాతీయ పుస్తక ప్రదర్శనలో తెలుగు సాహిత్యానికి 184, ఆంగ్ల సాహిత్యానికి 144, బాలల పుస్తకాలకు 18, ప్రభుత్వ సమాచారానికి 7, మీడియా సంస్థలకు 15 స్టాళ్లు చొప్పున ఏర్పాటు చేశారు. అంతకుముందు జరిగిన 35వ బుక్ ఫెయిర్‌ను 11 రోజుల పాటు నిర్వహించగా దాదాపు 10 లక్షల మంది పఠనాభిలాషులు సందర్శించడం రాజేశ్వరరావు వంటి నిర్వాహకుల అకుంఠిత శ్రమకు, దార్శనికతకు సజీవ సాక్ష్యం.

ఆయన జీవితంలో ఎదురైన తీవ్ర శారీరక వైకల్యం లేదా వ్యక్తిగత విషాదాలు కూడా ఆయన సంకల్ప బలాన్ని సడలించలేక పోయాయి. ఒక దారుణమైన రైలు ప్రమాదంలో ఒక కాలు, ఒక చేయి కోల్పోయినప్పటికీ ఆయన ఏనాడూ నిర్వేదానికి గురికా లేదు. ఆ వైకల్యాన్ని తన లక్ష్యానికి ప్రతిబంధకంగా కాకుండా, ఆత్మ విశ్వాసానికి సవాలుగా స్వీకరించారు. వైకల్యాన్ని జయించి, నిరంతరం పుస్తకాల మధ్య సంచరిస్తూ, ఆ క్రమంలోనే శేష జీవితాన్ని అక్షర సేవకు ధారపోశారు. 2024 నాటి బుక్ ఫెయిర్ కార్యక్రమాల్లోనూ ఆయన అత్యంత క్రియాశీలకంగా కోశాధికారి బాధ్యతలు నిర్వర్తించడం ఆయన నిరంతర శ్రమకోరతకు నిదర్శనం.

తెలుగు సాహిత్యం ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు మానవ వికాసానికి, సామాజిక చైతన్యానికి పీఠం వేసింది. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అని ప్రబోధించిన గురజాడ అప్పారావు మానవతావాదం, 'మహాప్రస్థానం'తో శ్రమజీవుల చైతన్యాన్ని రగిలించిన శ్రీశ్రీ కవిత్వం, విశ్వనాథ సాహిత్యంలో ప్రతిబింబించే సంస్కృతి సమగ్రతలకు పుస్తకమే ప్రధాన వాహకమని రాజేశ్వరరావు గాఢంగా నమ్మారు. 'పుస్తకం ఒక తరానికి మాత్రమే కాక, తరతరాల మానవాళికి మార్గదర్శనం చేసే జ్ఞానదీపం' అన్న సూత్రాన్ని ఆయన ఆచరణలో చూపి మార్గదర్శకుడిగా నిలిచారు.

నేటి వేగవంతమైన డిజిటల్ యుగంలో, డిజిటల్ తెరలు మరియు సామాజిక మాధ్యమాల ప్రభావంతో యువత పఠన అలవాట్లకు దూరమవుతున్న కాలంలో, పుస్తక ప్రదర్శనల ప్రాధాన్యత మరింత పెరిగింది. ఒక మంచి పుస్తకం ఒక వ్యక్తి ఆలోచనా సరళిని మార్చగలదు; ఆ ఆలోచన ఒక కుటుంబంలో పరివర్తన తెచ్చి, సమాజంలో మహోన్నత చైతన్యానికి దారితీస్తుంది. అటువంటి పఠన సంస్కృతిని సమాజంలో సజీవంగా ఉంచేందుకు తన జీవితాన్ని అర్పించిన రాజేశ్వరరావు భౌతికంగా మన మధ్య లేకపోయినా, హైదరాబాద్ బుక్ ఫెయిర్ రూపంలో, ప్రతి పుస్తక ప్రియుడి హృదయ స్పందనలో ఆయన జ్ఞాపకాలు నిరంతరం నిలిచే ఉంటాయి. అక్షరానికి, అక్షర సేవకుడికి మరణం ఉండదని నిరూపించిన రాజేశ్వరరావు గారి జీవిత ప్రస్థానం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక స్వర్ణాక్షరం.

**(రాజేశ్వరరావుకు అక్షర నివాళి)**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# నిజాం కాలం నాటి వందేళ్ల 'పోచారం'





తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి - మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పోచంరాల్ వద్ద లింగంపేట్ పెద్దవాగుపై వెలసిన మధ్య తరహా పోచారం ప్రాజెక్టు శత వసంతాలు పూర్తి చేసుకొని ఉత్తర తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నిజాం ప్రభుత్వ పాలనలో పోచారం ప్రాజెక్టు నిర్మాణం 1917లో శంకుస్థాపన రాయి వేసి రూపాయలు 27.11లక్షల వ్యయంతో, 1922లో పటిష్టంగా డంగు సున్నం రాయితో నిర్మించారు. అల్లాయిర్ నది, లింగంపేట్ నది, మంచిప్పవాగు వరద నీటి ఆధారంగా నిర్మించారు. తెలంగాణలో నిజాం చేపట్టిన మొట్టమొదటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టు కావడం గమనార్హం. 1.7 కి.మీ పొడవు, 21 అడుగుల ఎత్తు గల కట్ట ఇది. మొదటి సామర్థ్యం 2.423 టీ ఎం సీ, ఇప్పుడు ఒండ్రు కారణంగా 1. 82టి ఎం సీకి పడిపోయింది. అధికారికంగా 10, 500 ఎకరాలకు సాగు నీరు, తాగునీరు అందిస్తుంది. కానీ అనధికారికంగా 17, 000ఎకరాల వరకు సాగు నీరు అందిస్తుంది. 58 కి.మీ కాలువలు, 73 పంపిణీ కాలువలు (డిస్ట్రిబ్యూటరీస్)ఉన్నాయి. ఇప్పటికి 103 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2025 వరదల్లో 1.82 లక్షల క్యూసెక్కుల వరదను కూడా తట్టుకుని నిలబడింది. నిజాం ప్రభుత్వం నిర్మించిన ఈ జలాశయం 104వ ఏట అడుగు పెట్టి వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ.... రైతుల జీవితాలకు ఆధారంగా నిలుస్తోంది. కాలం మారినా, ప్రభుత్వాలు మారినా పోచారం ప్రాజెక్టు ప్రాధాన్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోచారం పేరు వినగానే ప్రకృతిఅందాలు, పచ్చని కొండలు, విశాల జలాశయం కళ్లముందు మెదులు తాయి. వర్షాకాలంలో ప్రాజెక్టులోకి వరద నీరు ఉప్పొంగి చేరే దృశ్యం ఎంతో కనువిందు చేస్తుంది. ప్రస్తుతం గేట్లు సక్ర మంగా పనిచేయని పరిస్థితుల్లో, ప్రాజెక్టు నిండిన పుడు అదనపు నీరు కట్టపై నుంచి పాలపొంగు లా ప్రవహిస్తూ కిందకు జాలువారడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆ నీరు మంజీరా నది ద్వారా నిజాంసాగర్ జలాశయానికి చేరి, చివరకు గోదావరి నదిలో కలుస్తుంది.

ఈ ప్రాజెక్టు కేవలం ఒక జలాశయం మాత్రమే కాదు. రైతుల జీవనాధారం కూడా. సాగునీటి పంపిణీ విషయంలో గతంలో తీవ్ర వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నీటికోసం రైతులు పరస్పరం తలపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో హైకోర్టు జోక్యం చేసుకుని సాగునీటి పంపిణీకి ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. దీని ప్రకారం 'ఏ' జోన్‌గా నాగిరెడ్డిపేట్ మండలం,'బీ'జోన్‌గా ఎల్లారెడ్డి మండలాన్ని విభజించారు. రబీ సీజన్లో ఒక సంవత్సరం ఒక జోన్‌కు, తదుపరి సంవత్సరం మరో జోన్‌కు నీటిని విడు దల చేసే విధానం అమలులో ఉంది. అయితే ఖరీఫ్ పంటకు మాత్రం రెండు జోన్‌లకు రైతులకు అవసరాన్ని బట్టి నీటిని అందిస్తారు. ఈ విధానం వల్ల వివాదాలు తగ్గి, నీటి పంపిణీలో కొంత పారదర్శకత ఏర్పడింది. ఇటీవలి వర్షాలతో పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పెరగడం రైతుల్లో కొత్త ఆశలు నింపింది. కొద్ది రోజుల క్రితం డెడ్ స్టోరేజ్ స్థాయిలో ఉన్న జలాశయం ఇప్పుడు గణనీయమైన నిల్వలను నమోదు చేయడం ఖరీఫ్ సాగుకు ఊరటనిచ్చింది. వర్షాలు ఆలస్యమైనా,ప్రాజెక్టులోకి వచ్చిన వరద నీరు ఆయకట్టు రైతులకు భరోసా కల్పిస్తోంది.

పోచారం ప్రాజెక్టుకు మరో ప్రత్యేకత పోచారం వన్యప్రాణి అభయారణ్యం. జలాశయం చుట్టూ ఉన్న అడవులు, పక్షులు, జంతువులు, ప్రకృతి సోయగాలు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా నిలబెట్టాయి. వర్షాకాలంలో ఇక్కడి అందాలు మరింత ఆహ్లాదాన్ని పంచుతాయి. సరైన ప్రచారం, పర్యాటక సదుపాయాలు కల్పిస్తే పోచారం తెలంగాణలో ప్రముఖ ఎకో-టూరిజం కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. నేటి పరిస్థితుల్లో పోచారం ప్రాజెక్టుకు మరమ్మతులు, గేట్ల ఆధునీకరణ, కాలువల పునరుద్ధరణ, పూడిక తొలగింపు వంటి పనులు అత్యవసరంగా మారాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ, ఆధునిక సాంకేతికతతో ఈ ప్రాజెక్టును బలోపేతం చేస్తే రాబోయే తరాలకు కూడా ఇది జీవనాడిగా నిలుస్తుంది. పోచారం ప్రాజెక్టు కేవలం నీటిని నిల్వ చేసే జలాశయం కాదు. చరిత్రకు సాక్ష్యం, రైతుకు భరోసా, ప్రకృతికి అందం, ఉత్తర తెలంగాణ అభివృద్ధికి చిరస్మరణీయ చిహ్నంగా నిలుస్తుంది.

**- ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
9440287170

# ప్రజాస్వామ్యం పై దమనకాండ !



దేశరాజధాని ఢిల్లీలో
యువత పై లాఠీ ఛార్జి-దేశ
భవిషత్తు పై బాష్పవాయువు !
తల్లిదండ్రుల ఆశాలపై పెల్లెట్ గన్స్ !!
పేరు లేని దుండగుల వీరంగం
సంస్కృతీ సంప్రదాయాల వీరులు, ఇక్కడ
అమ్మాయిల గుడ్డలు చించేశారు-
వీళసలు పోలీసులేనా ? లేక
పోలీసు యూనిఫాముల్లో ఆరెస్సెస్ కార్యకర్తలా?
అబద్ధాల్ని, అక్రమాల్ని
శాంతియుతంగా ఎదుర్కొన్న
'బొద్దికలు'- ఇంకా కొట్టండని - నిలబడ్డారు
చంపినా ఫరవాలేదని తెగబడ్డారు

బ్రిటీష్ తూటాలకు ఎదురు నిల్చిన నాటి,
స్వాతంత్ర్య పోరాట యోధులు గుర్తు కొచ్చారు-
నాటి 'జలియన్ వాలా బాగ్'
ఉదంతం చూడలేని ఈ తరానికి
ఢిల్లీలో ఈ బిజెపి ప్రభుత్వం
ప్రత్యక్షంగా చూపించింది.
గుజరాత్ మారణ కాండ,
మణిపూర్ మారణ కాండల గురించి
ఈ తరం యువతీ యువకులకు
పూర్తిగా తెలిసి ఉండదు,
అందుకే ఇక్కడ పార్లమెంట్ సాక్షిగా
దాన్ని పునః ప్రసారం చేశారు
భవిషత్తుకు దారులు వేయలేని ఈ ప్రభుత్వం
ప్రతిరోజూ గతాన్ని తవ్వుతూనే ఉంటుంది కదా?
ఒకప్పుడు గాంధీ అహింసను
కాల్చేసిన ఈ దుండగులు
నేడు యువత శాంతి ప్రదర్శనల్ని ఆదరిస్తారా?
కనీసం వారి ఆవేదన ఏమిటో
వినే ఓపిక లేని వారు
ప్రశ్నకు భయపడి పార్లమెంట్
వెనక గేట్ నుండి పారిపోతారు
యువతీ యువకుల పై మాత్రం
లాఠీలు, తూటాలు కురిపిస్తారు.
నాయం చేయడానికి న్యాయమూర్తులకు
వీడియోలు చూసే తీరిక లేదు-
వవస్థలన్నీ కుప్పగూలాయని చెప్పడానికి
నాయదేవతకు ఇంతకన్నా సాక్షం లేదు.
అసలు రాజినామా చేయాల్సింది
ప్రధాన్ కానే కాదు,
మొత్తం ప్రభుత్వమేనన్నది -
ఈ దేశం కోరుకుంటున్నది!

**- ప్రొ. దేవరాజు మహారాజు**

# సరళతే శిఖరం

గొట్టుగా క్లిష్టంగా రాయడం తేలిక
సరళంగా సూటిగా రాయడమే కష్టం
రాయడం నేర్చుకోవడం సులభమే
మనిషి గుండెను తాకేలా రాయడం చాలా కష్టం

కవిత అనేది పదాల విన్యాసం కాదు
మనిషి లోపల ఎన్నాళ్లుగానో మాట దొరకక
మౌనంగా నిలిచిపోయిన భావానికి
అది ఒక స్వరం

రాసే ప్రతి వాక్యం నీ ఒక్కడి గురించి కాకూడదు
అది చదివే ప్రతి ఒక్కరూ
'ఇదే నా జీవితం కదా!' అని అనుకునే అద్దమై
ఉండాలి

ప్రేమ గురించి రాస్తే అది ఇద్దరి కథగా
మిగలకూడదు
ప్రపంచమంతా ఒకసారి అయినా అనుభవించిన
స్పర్శగా మారాలి

దుఃఖం గురించి రాస్తే
అది నీ ఒక్కడి కన్నీటి చరిత్ర కాకూడదు
ప్రతి కంటి వెనుక దాగి ఉన్న ఉప్పునీటి రుచి
కావాలి

మంచి కవి పాఠకుడి హృదయంలో దాగి ఉన్న
మాటలను
అతని తరపున పలుకుతాడు

కవిత పూర్తయ్యాక
పాఠకుడు కవిని గుర్తు పెట్టుకోకపోయినా
పరవాలేదు
తనను తాను గుర్తు చేసుకుంటే చాలు
అదే సాహిత్య విజయం
సరళత అనేది చిన్నదనం కాదు
ఎన్నో అనుభవాలు అగ్నిలో కాలిపోయి
అహం అంతా బూడిదై
మిగిలిన స్వచ్ఛమైన సత్యం

అందుకే చాలా పెద్ద కవితలు కాదు
ఒక మనిషి నిశ్శబ్దాన్ని
మరో మనిషి గుండెకు చేర్చే

కొన్ని సాధారణ పదాలు రాయాలనుకుంటాను
ఎందుకంటే చివరికి
రచయిత రాసింది నిలవదు
పాఠకుడు తన హృదయంలో మళ్లీ రాసుకున్నదే
శాశ్వతమవుతుంది

**- వారాల ఆనంద్**

## జస్టిస్ చంద్ర కుమార్‌కు 'జయశంకర్ స్ఫూర్తి' పురస్కారం

ప్రజా న్యాయవాది, సమాజ సేవకుడు, కవి, రచయిత, నాటక కర్త, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ గారికి తెలంగాణ రచయితల వేదిక ప్రతి ఏటా అందిస్తున్న జయశంకర్ స్ఫూర్తి పురస్కారాన్ని ప్రకటించడమైనది. ఈ నెల 14 నాడు సాయంత్రం 6 గం.కు కరీంనగర్ లోని ఫిలిమ్ భవన్ లో ఈ పురస్కారాన్ని అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ చరిత్రకారులు, కవి, రచయిత, డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

**- బూర్ల వెంకటేశ్వర్లు, తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

# పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాం
- రూ.3.25 కోట్లతో ఎల్కతుర్తిలో నిర్మించిన కేజీబీవీ నూతన భవనం ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, పొన్నం ప్రభాకర్



ఎల్కతుర్తి, ఆగస్టు 10: (మనం న్యూస్ ): పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తోందని తెలిపారు, సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో రూ.3.25 కోట్లతో నిర్మించిన కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) నూతన భవనాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పేద కుటుంబాల పిల్లలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం విద్యారంగంపై భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు కడుపునిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో డైట్ ఛార్జీలను 40 శాతం, పేదింటి ఆడపిల్లలు వసతి గృహాల్లో చదువుకునేందుకు అవసరమైన కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పుస్తకాలు, ఇతర సామగ్రిని విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజుల్లోపే నాణ్యమైన మెటీరియల్తో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, సుమారు 3,500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతమైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను నిర్మిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేద పిల్లలకు మంచి విద్యను అందిస్తే వారు తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా, మరో పది మందికి, వంద మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని మంత్రి అన్నారు. గతంలో పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వాల వద్ద పెద్దఎత్తున భూములు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తరచూ చెబుతున్నారని పేర్కొన్నారు. అందుకే పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్య, వైద్యం పేదల జీవితాలకు రెండు కళ్ల వంటివని, ఈ రెండు రంగాలను బలోపేతం చేసి పేదల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి వెంటనే స్పందించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రిల్స్, ప్రహరీ తదితర అవసరమైన పనులను టాప్ ప్రాధాన్యతతో చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రజా ప్రభుత్వం : మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ: రాష్ట్ర విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో విద్యాబోధనపై పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యే భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి బలమైన పునాది అని పేర్కొంటూ, పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా నైపుణ్యాలు, వృత్తి పరమైన సామర్థ్యాలను పెంపొందించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. విద్య పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థికి మెరుగైన ఉపాధి, భవిష్యత్ అవకాశాలు లభించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ మాట్లాడుతూ₹ ఎల్కతుర్తి కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణ కార్యక్రమం పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. నాబార్డు నిధులతో అదనపు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ నిర్మాణ పనులు కూడా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని కేజీబీవీలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్గ్రేడ్ చేయడంతో పాటు, అన్ని జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులకు నూతన యూనిఫాంలతో పాటు ట్రంక్ బాక్సులు, ఇతర అవసరమైన సామగ్రిని అన్ని పాఠశాలలకు ఇప్పటికే అందజేశామని తెలిపారు. కేజీబీవీల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అన్న అంశంపై ఏపీసీలు, కోఆర్డినేటర్లు, డీఈఓ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు.జ ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థినులకు బ్లాంకెట్లు, ట్రంక్ బాక్సులు, కార్పెట్లు, ఇతర అవసరమైన సామగ్రిని స్వయంగా అందజేశారు. నూతన భవనంలో విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చిన వసతులను పరిశీలించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, పొన్నం ప్రభాకర్లు ఘనంగా సన్మానించి, అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. +ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, డీఈఓ గిరిరాజ్ గౌడ్, ప్రిన్సిపాల్ అనితాదేవి , వివిధ శాఖల అధికారులు, కేజీబీవీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణే రాష్ట్రప్రభుత్వ లక్ష్యం



- రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి రూ.600 కోట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి
- ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయానికి రూ.3.25 కోట్లతో శంకుస్థాపన మంత్రులు పొంగులేటి , పొన్నం ప్రభాకర

ఎల్కతుర్తి: ఆగస్టు 10(మనం న్యూస్ ): పేదల సంక్షేమం, రైతుల భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో కలిసి రూ.3.25 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి అవసరమైన కార్యాలయ భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో మండలాలు ఉన్నా కార్యాలయ భవనాలు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి సుమారు రూ.600 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 180 తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతులు, భూ యజమానులకు భూములపై సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించే దిశగా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో పాటు పారదర్శకమైన విధానంలో భూభారతి ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. భూ పరిపాలనలో మరిన్ని సంస్కరణలను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి భూ పార్సిల్కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు భౌగోళిక కోఆర్డినేట్స్తో కూడిన మ్యాప్ను రూపొందించి అందించే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల సహకారంతో భూ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసి భవిష్యత్తులో భూములకు సంబంధించి వివాదాలు, సమస్యలు తలెత్తకుండా శాశ్వత భూ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### ఎల్కతుర్తి సమగ్ర అభివృద్ధికి కృషి : మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,₹ ఎల్కతుర్తి మండల ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎల్కతుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేలా చర్యలు చేపడతామని తెలిపారు. మండలానికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఆర్టీఓ కార్యాలయ భవన పనులను పూర్తిచేసేందుకు అవసరమైన అదనపు నిధులను కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డిని కోరారు. ఎల్కతుర్తి ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుని మండలాన్ని మరింత ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, ఆర్డీవో కార్యాలయానికి అవసరమైన అదనపు నిధులను ఈ వారంలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్ రవి, ఎన్పి డిసిఎల్ ఎస్ ఈ సామ్య నాయక్ , స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ సభను సక్సెస్ చేసినందుకేనాపై రాజకీయ కుట్ర

- పొలిటికల్ టార్గెట్ జగ్గారెడ్డి ' అనే కోణంలో పోలీసులతో నాపై, నా బంధువులపై విచారణ జరిపించారు
- సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ ల ముగింపు సమావేశంలో జగ్గారెడ్డి



సంగారెడ్డి ఆగస్టు 10 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి లో రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంతో రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు హరీష్ రావు కుట్రలు చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ బీఎల్ఏల సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సంగారెడ్డికి మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి కిరణ్కుమార్రెడ్డి ప్రతిపాదనలు పంపించారని జగ్గారెడ్డి తెలిపారు. అనంతరం ఆ కాలేజీని అప్పటి మంత్రి హరీశ్రావు సిద్దిపేటకు తరలించారని ఆరోపించారు. సంగారెడ్డికి మెడికల్ కాలేజీ కోసం తాను మూడేళ్లపాటు పోరాటం చేశానని, ఆ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు తనపై పోలీసులతో కేసులు పెట్టించే ప్రయత్నాలు జరిగాయని చెప్పారు.2017లో సంగారెడ్డిలో రాహుల్గాంధీ సభ నిర్వహించాలని అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్కుమార్రెడ్డి తనను కోరారని తెలిపారు. కాంగ్రెస్ నుంచి వలసలను అడ్డుకునేందుకు భారీ సభ నిర్వహించాలని నిర్ణయించి, సుమారు మూడు లక్షల మందితో సభను నిర్వహించామని చెప్పారు. ఇందుకోసం రూ.6.5 కోట్ల అప్పు తీసుకున్నామని, సభ విజయవంతం కావడంతో తనపై రాజకీయ కక్ష మొదలైందని జగ్గారెడ్డి ఆరోపించారు. తనపై అక్రమాస్తులు, భూ వ్యవహారాలకు సంబంధించిన ఆరోపణలపై అప్పటి సిటీ పోలీసు కమిషనర్ మహేందర్ రెడ్డి తో పాటు విజిలెన్స్ విభాగానికి చెందిన ఒక ఐపీఎస్, నలుగురు డీఎస్పీ లు విచారణ జరిపారని, అయితే తన వద్ద అక్రమ ఆస్తులు లేవని విచారణలో తేలిందని చెప్పారు. పటాన్చెరులో భూ వ్యవహారాలపై కూడా విచారణ జరిపించారని, ఆ ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయని పేర్కొన్నారు. తనపై 40 పిటిషన్లు వేయించి పీడీ యాక్ట్ కింద జైలుకు పంపాలని ప్రయత్నాలు జరిగాయని జగ్గారెడ్డి ఆరోపించారు. తనకు అప్పులు ఇచ్చిన వారితో ఫిర్యాదులు చేయించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని చెప్పారు. అయితే వారు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడం తో ఆ ప్రయత్నం విఫలమైందన్నారు. తనపై ఎలాగైనా పీడీ యాక్ట్ పెట్టాలని అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ వద్ద సమావేశం నిర్వహించారని, పోలీసులు కూడా తనపై కేసులు పెట్టడం సాధ్యం కాదని చెప్పడంతో చివరకు పాస్పోర్ట్ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపారని పేర్కొన్నారు. నేను ఎన్ని కష్టాలు పడ్డానో నాకు మాత్రమే తెలుసు. రివెంజ్ పాలిటిక్స్ నేను చేయను. ఇప్పటికీ హరీశ్రావును నేను నిందించడం లేదు. ఆయన తన వ్యూహంలో భాగంగా పని చేశారు అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. తనపై జరిగిన పరిణామాల గురించి రాహుల్గాంధీకి పూర్తిగా తెలియకపోవచ్చని, అయితే సంగారెడ్డి ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలను చెబుతున్నానని జగ్గారెడ్డి అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి






- జగిత్యాలలో జైల్ బరో పేరుతో ఆందోళన, పోలీసుల అరెస్టు,
- పోలీసుల దౌర్జన్యం నశించాలి..
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, లెల్లెల బాలకృష్ణ
- సి ఐ టీ యు రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్

జగిత్యాల ఆగస్టు 10( మనం ప్రతినిధి ): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఎండ గట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీపీఎం జిల్లా ఇంచార్జి లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అండగా ఉంటూ కార్మిక, రైతు, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆరోపిస్తూ ఈ రోజు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ చౌరస్తా లో రస్తారోకో జైల్ భరో నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆద్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నాయకుల ధర్నాను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తెలంగాణ సీపీఎం పార్టీ జిల్లా ఇంచార్జి లెల్లెల బాలకృష్ణ, సిఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఇఫ్ట్ ఐ ఎఫ్ టి ఐ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్ లు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం,ఐకెపి వివోఏ, ఫీల్ అసిస్టెంట్, ఆరోగ్య శాఖలో వివిధ స్కీంలో కోటి మంది వర్కర్లు పని చేస్తున్నా నేటికి ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకోలేదన్నారు. కార్మికుల హక్కులను కాలరా స్తూ కేంద్రం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడులను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేయక పోవడంతో ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రతా చట్టానికి కేంద్ర తూట్లు పొడిచి అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు 35 కిలోల బియ్యాన్ని రద్దు చేసి ఒక్కో మనిషికి 7 కేజీల బియ్యాన్ని మాత్రమే ఇస్తుందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దీన్ని నిలువరించేందుకు ప్రజలు ఆందోళనలకు సిద్ధంగా ఉండలన్నారు. ఇప్పటికయినా కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అద్యక్షులు,కార్యదర్శి ఇందారి సులోచన, కోమటి శేఖర్, సీపీఎం జిల్లా నాయకుడు భూతం సారంగ పాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శారద, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఎ.రజిత,స్వప్న, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు జంగిలి ఎల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మాల్యాల సురేష్, సిఐటియు జిల్లా కోశాధికారి వెల్మలపల్లి వేంకటచారి, జిల్లా నాయకులు ఇ నర్సయ్య, ఎస్ డబ్ల్యూ ఎఫ్ వీరగోని శ్రీనివాస్, ఆశాది సుజాత, వడ్లకొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్కి వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు

- పర్యాటకులు పోలీస్ వారి సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి
- మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 10 (మనం ప్రతినిధి ) : తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు.ఈసందర్భంగా బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు.పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సరదా విషాధంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

## దేశాయిపల్లె శివారులో గుంతలమయంగా మారిన రహదారి



- తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

బోయినపల్లి,ఆగస్టు 10,(మనం న్యూస్ ):- రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం దేశాయిపల్లె గ్రామ శివారులోని రహదారి గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. కొదురుపాక నుంచి బోయినపల్లికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ రైతులు, ప్రజలు, అధికారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. అయినప్పటికీ రహదారి పరిస్థితిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.ప్రజలు, రైతులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిపై వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారిని పరిశీలించి గుంతలను పూడ్చి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడకముందే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- పరిశీలించిన జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఆగస్టు 10 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి పట్టణంలో గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ. జగ్గారెడ్డి కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సభలు, కార్యక్రమాలు నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం, తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను వారు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ అధికారులు , ఆర్డిఓ మున్సిపల్ కమిషనర్ తాసిల్దారు పోలీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆహ్వానం



జగిత్యాల, ఆగస్టు 10 ( మనం న్యూస్ ): జగిత్యాల పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ లకు తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల బృందం సభ్యులు వారి నివాసం లో మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ మరియు కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల జాతర పండుగ కార్యక్రమానికి అడువాల జ్యోతి లక్ష్మణ్ కు ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా కళాకారుల బృందం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆహ్వానాన్ని స్వీకరించి కళాకారుల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా బోనాల వేడుకలు

## కిటకిటలాడిన అమ్మవార్ల ఆలయాలు

## దర్శించుకున్న రాజకీయ నేతలు, భక్తులు

## అలరించిన పోతరాజుల విన్యాసాలు

## గోనెమ్మ తల్లికి 'మనం' ఎడిటర్ ఉప్పరి రమేష్ పూజలు



**పటాన్ చెరు, ఆగస్టు 10 (మనం న్యూస్) :** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో సోమవారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాలకు మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పించారు. బోనాల వేడుకల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల్లోని అమ్మవార్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు దర్శించుకున్నారు. డప్పు చప్పుళ్ళు, శివసత్తుల నృత్యాలు, యువత కేరింతల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులు సందడిగా జరిగాయి. బోనాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనం దినపత్రిక ఎడిటర్ ఉప్పరి రమేష్ మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మున్నూరు కాపు సంఘం నాయకులతో కలిసి పటాన్ చెరు పట్టణం గోనెమ్మ బస్తీలోని గోనెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



# నేడు గోనెమ్మ బస్తీ పలారం బండి ఊరేగింపు



**పటాన్ చెరు, ఆగస్టు 10 (మనం న్యూస్) :** గోనెమ్మ బస్తీ జూనియర్ బాయ్స్ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఏర్పాటు చేస్తున్న పలారం బండి ఊరేగింపు మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆషాడ మాసంలో బోనాల సందర్భంగా ఏర్పాటు చేసే పలారం బండికి సంబంధించిన ప్రత్యేక పూజలు సోమవారం రాత్రి నిర్వహించారు. జూనియర్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంబంధించిన పూజా కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు నాయకోటి భోజయ్య , ప్రధాన కార్యదర్శి , మనం తెలుగు దినపత్రిక ఎడిటర్ ఉప్పరి రమేష్ కుమార్ , కాషాల యాదయ్య , మైలారం అశోక్ , ఎంజాల సాయి , మనోజ్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించే కార్యక్రమానికి స్థానికులు , భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మనోజ్ విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి పాలంపేట సర్పంచ్



**ములుగు, ఆగస్టు 10 లలో మనం ప్రతినిధి:** పాలంపేట (రామప్ప) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ చల్లగుంట రాజు, మాజీ సర్పంచ్, గౌడ సంఘం అధ్యక్షుడు కారిపోతుల సత్యం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం వెంకటాపూర్లో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో వెంకటాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్గౌడ్ ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిశెట్టిపల్లి బ్రిడ్జి ఎప్పుడు నిర్మిస్తారు?

- 22 ఏళ్లుగా హామీలే.. పనులు మాత్రం శూన్యం: జాడి రామరాజు



**ఏటూర్ నాగారం ,ఆగస్టు 10 ,మనం ప్రతినిధి:** ఎలిశెట్టిపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 22 ఏళ్లుగా హామీలు ఇస్తున్నా ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదో మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డా. జాడి రామరాజు డిమాండ్ చేశారు. సోమవారం ములుగులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులు ఎలిశెట్టిపల్లి వాగును సందర్శించిన అనంతరం కాంగ్రెస్ నాయకులు అర్ధరాత్రి గ్రామానికి వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు తీయించారని ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం రూ.21 కోట్లు, రాష్ట్రం రూ.5 కోట్లు కేటాయిస్తున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఏటూరునాగారం బస్ డిపో, రెవెన్యూ డివిజన్ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందో మంత్రి స్పష్టం చేయాలని రామరాజు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు

**హనుమకొండ జిల్లా ఆగస్టు 10 న్యూస్ :** రోజు హన్మకొండ లో జరిగిన సింగరేణివిశ్రాంత ఉద్యోగుల సమావేశములో మాధవరావు అధ్యక్ష వహించగా సింగరేణిలో వి ఆర్ ఎస్ తీసుకున్న కార్మికులకు కూడా సిపిరమ్స్ వర్తించే విధంగా వారికి కూడా సీపీరమ్స్ కార్డు లు ఇవ్వాలని వారూ కూడా చాలీ చాలని పెన్షనతో ఇబ్బంది పాపుతున్నారని మరియూ కన్నెస పెన్షన్ 10000 రూపాయలు దా తో కూడిన పెన్షన్ ఇవ్వాలని అర్హులకు ఆసరా పెన్షన్ గ్రీన్ రేషన్ ఇవ్వాలని కోరినారు ఈ సమావేశములో నలుబాల దామోదర్ కోశాధికారి రాంమోజురామ్మూర్తి సదానందం విద్యాసాగర. చారీ పాల్గొన్నారు దాదాపు 50 మంది విశ్రాంతఉద్యోగులు హాజరైయినారు

# మామునూరు విమానాశ్రయం పనులు వేగవంతం

## కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడికి విజ్ఞప్తి

**వర్ధన్నపేట, ఆగస్టు 10 (మనం న్యూస్):** వరంగల్-మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలని తెలంగాణ బీజేపీ నేతల బృందం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడిని కోరింది. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకట రమణ తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయం చుట్టుపక్కల గ్రామాల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు కూడా అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు ఉమ్మడి వరంగల్ పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక అభివృద్ధికి కీలకమని నేతలు పేర్కొన్నారు. విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. నేతల విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# డీఎస్సీ అవకతవకలపై ర్యాలీకి అనుమతి నిరాకరణ అప్రజాస్వామికం

**యు. కొత్తపల్లి ఆగస్టు 10 (మనం న్యూస్):** డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో అవ కతవకలను నిరసిస్తూ నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి అనుమతి నిరాకరించడంతో పాటు నాయకులకు నోటీసులు జారీ చేయడం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు పరాకాష్ఠ అని వడిశెట్టి నారాయణరెడ్డి సోమవారం విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అవ కతవకలపై ప్రశ్నిస్తున్న వారిని అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న నాయకులకు నోటీసులు ఇవ్వడం, ర్యాలీకి అనుమతి నిరాకరించడం సరికాదన్నారు. నిరుద్యోగులు, అభ్యర్థుల సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలను అణచివేసే చర్యలను తక్షణమే విరమించుకోవాలని, డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఆశలపై చన్నీళ్లు



- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయ హోదాకు నో
- రాజ్యసభకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

**ఢిల్లీ, ఆగస్టు 10 :** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జల వివాదాలు కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 పరిధిలో న్యాయ విచారణలో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఈ అంశాలు పరిష్కారం కాకుండా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ చేపట్టడం సాధ్యం కాదని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్రం తిరిగి రాష్ట్రానికి పంపినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికకు అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్ను పునఃసమీక్షించి సమర్పించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. కాగా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం చాలాకాలంగా కోరుతోంది. అయితే ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేంద్ర పరిశీలనలో లేదని తాజా సమాధానంతో స్పష్టమైంది. మరోవైపు కృష్ణా జలాల పంపకాలు, అంతర్రాష్ట్ర వివాదాలు ట్రైబ్యునల్ పరిధిలో ఉండటంతో ప్రాజెక్టు అంశంలో ముందడుగు వేసే పరిస్థితి లేదని కేంద్రం తేల్చిచెప్పింది. దీంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశంపై తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి నిరాశ ఎదురైనట్లయింది.

# ట్యాంక్‌బండ్‌లో టేకాఫ్.. ప్రకాశం బ్యారేజీలో ల్యాండింగ్

- రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సీ-ప్లేన్ సర్వీసులు
- తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనపై కేంద్రం సానుకూలత
- హుస్సేన్ సాగర్ లో ఏఏఐ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- ఒక సారికి 9 నుంచి 12 మంది ప్రయాణించే వీలు
- రెండు రాష్ట్రాల మధ్య పర్యాటకానికి కొత్త ఊపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరికొత్త పర్యాటక శకానికి శ్రీకారం చుట్టే సీ-ప్లేన్ ప్రాజెక్టు ఊహల నుంచి ఆచరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, కేంద్రం సానుకూలతతో ఈ ప్రతిష్ఠాత్మక పథకం పట్టాలెక్కుతోంది. ఈ క్రమంలోనే, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లో 'వాటర్ ఏరోడ్రోమ్' ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేశారు. ట్యాంక్‌బండ్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు విమానంలో ప్రయాణించే అద్భుత అనుభూతిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా కసరత్తు ముమ్మరమైంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమై ఈ ప్రతిపాదనను చర్చించారు. హుస్సేన్సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ-ప్లేన్ సేవలు ప్రారంభిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్ ఏర్పడుతుందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ చర్చల అనంతరం ప్రాజెక్టులో వేగం పుంజుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలకు అనుగుణంగా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉన్నతాధికారుల బృందం నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. సీ-ప్లేన్లు సురక్షితంగా టేకాఫ్, ల్యాండింగ్ అవ్వడానికి అవసరమైన వాటర్ ఏరోడ్రోమ్ పాయింట్లు, నీటి లోతు, ప్రయాణికుల రాకపోకలకు అనువైన ప్రాంతాలపై ప్రాథమిక అంచనాకు వచ్చారు. త్వరలోనే ఈ బృందం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా ఇదే తరహా సర్వే నిర్వహించనుంది. సీ-ప్లేన్ల కోసం ప్రత్యేకంగా రన్వే అవసరం లేదు. నీటిపైనే దిగి, అక్కడి నుంచే గాల్లోకి ఎగురుతాయి. వీటి కోసం 'వాటర్ ఏరోడ్రోమ్'లను నిర్మిస్తారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఒక్కో సీ-ప్లేన్లో 9 నుంచి 12 మంది ప్రయాణించవచ్చు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో ట్రయల్ రన్స్ జరిగినా, ఈసారి పూర్తిస్థాయి సర్వీసులు ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఉన్నాయి. ఏఏఐ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తదుపరి చర్యలు తీసుకోనున్నాయి.

# సమాజ తోడ్పాటుకు కులవృతులే కీలకమంటూ 'అసిపె'తో నిరూపితమైంది

రచయిత వనపట్ల సుబ్బయ్య తన తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన కులవృత్తి క్షౌర వృత్తిని లిఖించడమే కాదు తండ్రి చేసిన కులవృత్తి లోని వివిధ సేవలను మరోమారు యాదికి చేసుకున్నారు. ఊర్లో భూస్వాముల ఇళ్ల దగ్గరకు వెళ్లి చేసిన క్షౌరం, బీద బిక్కి వ్యవసాయ కూలీలకు సవురాలు చేస్తూ ఊరిలో ఏ ఇంట్లో శుభకార్యాలు జరిగినా మంగలాయన ముందుండాల్సిందే అంటూ తన తండ్రి శ్రమను కవిత్వీకరించారు. తమ కుల వృత్తిని చిన్న చూపు చూసే వారికి దీటుగా ఈ పుస్తకంతో బదులు ఇచ్చారు, తమ వృత్తిని సాహిత్య పుటలకి దూరమైంది అంటూ తనే స్వయంగా మంగలి వారి పని తీరును తెలుపుతూ బహుజన కవి రచయిత వనపట్ల సుబ్బయ్య 'అసిపె' దీర్ఘ కావ్యంతో కుల వివక్షతకు గురై ఇరుకు గదులలో పరిమితం చేసిన మనుగడ నుండి తమ వృత్తిని కూడా గౌరవ ప్రధానమని సగర్వంగా ప్రకటిస్తూ చరిత్ర పుటల్లో లిఖిస్తూ బాహ్య ప్రపంచంలోకి ఈ పుస్తకాన్ని తీసుకు రావాడం జరిగింది. పుస్తకంలోకి వెళ్లినట్లు అయితే కోడి తొలి కూతతో లేచి రైతు భుజాన నాగలితో ప్రయణించినట్లు సంకన అసిపెతో తన తండ్రి మంగలి బాలయ్య ఊరిల సవురాలకు బయలు దేరుతారని అంటారు. 'గద్ద గూళ్లలా మాసిన నెత్తులు కాశ గడ్డిలా పెరిగిన గడ్డాలు సాలు పట్టిండంటే మునుమెల్లినట్లే' అంటూ సవురాలు వొడిసెటాలకు అంబటాలయ్యేద'ని చెప్పారు. నేను బడి నుండి ఇంటికి వచ్చే యాలకు మా నాన్న వచ్చే వాడంటూ తన భుజాన సెల్ల చూసేది' తిన్నడానికి ఏమైన తెచ్చాడేమోనని అని చిన్ననాటి రోజులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఊరిలో పెండ్లైతే మైలపోలు, సన్నాయి బ్యాండు మేళాలు మావే అంటారు. 'అసిపెనే మా ఇంటికి బువ్వ' అంటూ జీవనోపాధిని యాదికి చేశారు. 'మా బతుకు పెట్టె మణి దీపం మా అసిపె'అని గౌరవించుకున్నారు. ఊరు అందంగా లేదంటే ఊరిల అసిపె లేనట్లే అంటారు. 'మా అయ్య చేతిలో అసిపె ఉంటే అశోకుడి మగధ సామ్రాజ్యం చేతుల ఉన్నట్లే' అంటూ ఆత్మగౌరవం చాటుకున్నారు. వ్యవసాయదారులు క్షవరాలు, కాళ్లకు ముళ్ళు, ఇరిగినా మంగలాయననే తీయాలి, అలాగే వారు పండించిన తీరొక్క పంట గింజలు మా గుమ్మిలో ఉంటాయని చెప్పారు.ఎనకటికి గర్భిని స్త్రీలకు కార్పొరేట్ వైద్యం లేదు అంతా ఆకులు పసర్లు, మంత్రసానిలు మా మంగళ స్త్రీలే పురుడు పోసెవారంటూ స్త్రీ శక్తిని కొనియాడుతూ ప్రస్తుతం టెస్ట్ ట్యూబ్, లతో జీవం పోస్తున్నారని తెలిపుతూ మంగళ్లు తొలి వైద్యులు అంటారు. కుల వృత్తులు ఒకదానిపై ఒకటి ఆధార పడి ఉంటాయన్నారు. కటింగ్ తోనే అందాలు అంటారు. వారసత్వం అనవాయితిగా వస్తుందంటూ మాదిగ తాతలకు మహా వందనాలు తెలిపారు. నూరురాయిని రకరకాలుగా పొగుడుతూ మా తాత ముత్తాతలకు పదివేల వందనాలంటూ పొగిడారు. మా ఆస్తులు ఆదాయం మంగలి పని అంటూ నిర్మోహమటకంగా చెప్పారు. క్షవరపు పెట్టే మా బతుకు పెట్టే అంటూ వాటిలోని ప్రత్యేకతను కవిత్వీకరించారు. నాయి బ్రహ్మనుడు అంటూ శుభకార్యాలకు, అశుభాలకు మంగలి వాళ్ళు తప్పని సరి అంటూ వారి జీవనవిధానం తెలుపుతూ వెనుకబాటు తనాన్ని గుర్తుకు చేశారు. పట్టణ, గ్రామ అభివృద్ధిలో మా డబ్బాలు తీసి వేస్తారంటూ దీంతో కుటుంబ పోషన కష్టం అవుతుందంటూ వారి కష్టాలను వివరించారు. ఎండకు వానకు తడుస్తున్నా తమ వృత్తి చేయాలంటూ లేదంటే ఆకలితో పస్తులుండాలంటారు. మంగలి వృత్తి నమ్ముకొని మాట తప్పక నిజాయితీగా పని చేసుకునే వాళ్ళమని మననం చేశారు. సెలబ్రిటీల మొదలు అందరిని అందంగా తీర్చిదిద్దేది మేమే అంటారు. మా త్యాగాలు మరువనివి అంటూ సన్నాయి శక్తి గొప్పదన్నారు. స్వయం కృషితో ఎదిగామంటూ మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడుతే పాలకులపై తిరగబడుతామని రాశారు. పెండ్లిలో సన్నాయి పాటలు మంచి సందర్భాన్ని గుర్తుకు చేస్తూ నాద స్వరం ప్రత్యేకతను తెలిపారు. త్యాగరాయ కీర్తనలు దేవుడి ఊరేగింపులో ఆ నాద స్వరాలు, డొళ్లు, తాళం వంటివి మనిషికి మనో వికాసానికి తోడ్పాడుతాయంటారు. తలనీలాల్లో కూడా మంగలి వారికి కన్నీళ్లు మిగులుతున్నాయంటూ శ్రమకు తగిన వేతనం ఇవ్వాలంటారు. అగ్రవర్ణాలకు నిమ్న కులాలకు జరిగే ఘర్షణలో మేము నిమ్నా కులాల పక్షమే అని తెలిపారు. బ్యూటీ పార్లర్లు కార్పొరేట్ సెల్యూన్ లు పెరిగడంతో




సామాన్యుల మంగలి వారి జీవనాధారం కష్టమైందంటారు. పెరిగిన ప్రపంచీకరణలో కుల వృత్తులు కనుమరుగైపోతున్నాయంటూ ఆవేదన చెందారు. మానవుడు పుట్టిన నాటి నుండి చచ్చే వరకు మంగలి వారే అంటూ వారి సేవలను గుర్తించక అవహేళన చేస్తున్నారంటూ ఆవేదన చెందారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తెలంగాణ సాధించడంలో మా పాత్ర ఉందంటారు. మంగలి వారంతా ఒక్కే కుటుంబం అంటూ ఐక్యమత్యంతో మెలగాలని సూచించారు. కరోనా కాలంలో అందరూ కష్టాలు పడ్డారు షాపులు కిరాయిలు కట్టలేని పరిస్థితి ఉండే, ప్రస్తుత గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మంగలి వారికి ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన చెందారు. చివరిగా నాన్నపై మమకారంతో తనకు ఉన్న అనుభవాలను నెమరువెసుకున్నారు.

ఈ దీర్ఘ కావ్యంలో సాధరణ దైనందిన జీవనంలో జరిగే కుల వృత్తిని దాంట్లో ఉన్న కష్టనష్టాలు ఎదురైనా పూర్వీకులు వృత్తిని బాధ్యతగా తీసుకుని సేవలు అందిస్తారు. అప్పుడే ఆ రంగానికి పరిపూర్ణత వస్తుంది అలానే కవి తమ విజ్ఞానవంతుడు కాబట్టి సామాజానికి తెలియపర్చాలని ఈ దీర్ఘ కావ్యం వెలుగులోకి తీసుకువచ్చారు. కవిత్వం అనేక రకాలుగా కవిత వస్తువులతో రాయవచ్చు అందుకే సమాజంలో రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఒక వెనుకబడిన కులం గురించి రాయడం వారి మార్పుకై తాపత్రయపడటము విశేషముగా భావించాలి. తెలుగు బహుజన కవిత్వంలో ఈ వృతిపై ఇదే మొదటి దీర్ఘ కావ్యం. అసిపె పుస్తకం రచయిత స్వయంగా తన కుల వృత్తిని చేస్తూ ఉన్నదున్న దీర్ఘ కావ్యంలో కుల విశిష్టతను కులంకషంగా వివరిస్తూ ఏ సందర్భాన్ని వదిలి పెట్టకుండా గ్రామీణ పరి భాషలో అర్థవంతంగా ముందుకు సాగింది ఇలాంటి పుస్తకం రావడం బహుజన కవిత్వంలో ఒక మంచి తరుణమనే చెప్పాలి.

**WARNING REGARDING SALE, PURCHASE AND TRANSFER OF LAND**

Notice is hereby given to the general public that the land situated at **SAJJAPUR VILLAGE , KOHIR** [Mandal], **SANGAREDDY,** [District), TELANGANA. bearing **Survey No. 76/అ** admeasuring **0.27 Ac** Acres/**Guntas**, is subject to a dispute regarding its ownership and/or legal rights. It has come to our notice that M**r. Methari Sudhakar S/o M. Papaiah** is attempting to sell, register, transfer, or otherwise create third-party rights over the said land, or anybody else are not having lawful authority or valid rights to do so. Therefore, the general public, prospective purchasers, and all concerned persons are hereby CAUTIONED AND WARNED not to purchase, sell, register, mortgage, transfer, or otherwise deal with the above-mentioned land in any manner whatsoever. Any person entering into any transaction concerning the said land, despite this public notice, shall do so entirely at his/her own risk and responsibility. The undersigned shall not be responsible for any loss, dispute, or legal consequences arising from such transaction. All persons concerned are hereby advised to refrain from entering into any transaction or creating any third-party interest in respect of the said land.

**NOTICE ISSUED BY:**
**Sd/- Shaik Summair Hussain**
B.A.LLM., Advocate
Contact Number: **8919712519**
Date: 10/08/2026
Place: Sangareddy

# రాష్ట్ర, జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలి

## ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన ఎంపీ రఘురాం రెడ్డి

## ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 'పీఎం-సేతు' హబ్ కేటాయించాలి

## రక్షణ కారిడార్కు ఆమోదం తెలపాలని కోరిన ఎంపీ



ఖమ్మం, ఆగస్టు 10(మనం బ్యూరో): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల సాధన, పారిశ్రామికాభివృద్ధి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 'పీఎం-సేతు' హబ్ కేటాయించాలని కేంద్ర కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. పరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రాంతాలకే ఐటీఐల ఆధునీకరణ పరిమితం కాకుండా, గ్రామీణ, గిరిజన ప్రాంతాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రధాన డిమాండ్లు :**

ఖమ్మం-కొత్తగూడెం క్లస్టర్: ఖమ్మం ఐటీఐని హబ్గా గుర్తించి, కొత్తగూడెం తదితర ఐటీఐలను స్పోక్స్గా అనుసంధానించాలి. అగ్రి-టెక్ హబ్: ఖమ్మంలో మిరప ప్రాసెసింగ్, ఫుడ్-ప్రాసెసింగ్ స్కిల్ సెంటర్ను ఏర్పాటు చేయాలి. కొత్తగూడెంలో మైనింగ్ శిక్షణా కేంద్రం: కొత్తగూడెంలో ప్రత్యేకంగా 'ట్రైబల్ స్కిల్ అండ్ ఎనర్జీ మైనింగ్ సెంటర్'ను ఏర్పాటు చేయాలి. ఆధునిక కోర్సులు: ఈవీలు, సోలార్ ఎనర్జీ, డ్రోన్లు, రోబోటిక్స్ కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు.

**హైదరాబాద్-బెంగళూరు రక్షణ కారిడార్కు ఆమోదం తెలపండి:**

హైదరాబాద్-బెంగళూరు రక్షణ పారిశ్రామిక కారిడార్ను రక్షణ, ఏరోస్పేస్ కారిడార్గా అధికారికంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని పునరుద్ఘాటిస్తూ కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ను తెలంగాణ బృందం కలిసింది. తెలంగాణలో ఏరోస్పేస్ ఎగుమతులు 100 శాతం వృద్ధి సాధించాయని, దీనికి ఆమోదం తెలపాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, మహబాద్ ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ఫోకస్

## కొత్తగా బొగ్గు బ్లాకుల కేటాయింపులు

## నల్ల బంగారం కంపెనీకి తిరుగులేని భవిష్యత్తు

## తాజాగా వేలంలో మరో పీకేఓసీ-2 బ్లాక్

## కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకలను సాధించేందుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు

## తక్కువ సమయంలోనే సింగరేణికి రెండు చారిత్రక విజయాలు నమోదు



## ప్రభుత్వ కృషితో బలపడుతున్న సింగరేణి సామ్రాజ్యం

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 10(మనం న్యూస్): సింగరేణి పరిరక్షణ విస్తరణతోపాటు రాష్ట్ర ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న సంకల్పంతో గత కొన్ని నెలలుగా అవిశ్రాంతంగా ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తూ సింగరేణికి కొత్త ఊపిరి లభిస్తుంది. తాజాగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్లైన్ వేలంలో మణుగూరు ఏరియా అస్తిత్వానికి అతి కీలకమైన పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయంగా చెప్పుకోవచ్చు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడుకోవడానికి కొత్త బ్లాక్లను దక్కించుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్కు అనుమతులు రావడంతో అటుగా 36 ఏళ్ల పాటు సంస్థకు బలమైన పునాది వేసే నైనీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని అధికారులు ఇదివరకే స్పష్టం చేయడం జరిగింది. 2013లో యూపీఏ హయాంలో మైనింగ్ అనుమతులు జారీ చేసిన తాడిచర్ల -2 బొగ్గు బ్లాక్ను గత బీఆర్ఎస్ పాలకులు విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు మంత్రులు కేంద్రంతో సంప్రదింపులు జరిపి మైనింగ్ లీజులు జారీ చేయించారు. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను 45 ఏళ్ల పాటు వెలికితీయడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ గనితో 120 మిలియన్ టన్నుల నాణ్యమైన జీ-8 గ్రేడ్ బొగ్గును వెలికితీయొచ్చని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును మన విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. మరీ ముఖ్యంగా సింగరేణిలో అత్యంత కీలకమైన ఏరియాల్లో ఒకటైన మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని పరిరక్షించడంలో ఈ బ్లాక్ కీలక పాత్ర పోషించనుందని మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభించడమే కాకుండా మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ బ్లాక్లోని నాణ్యమైన బొగ్గు నిల్వల ద్వారా రాబోయే 20 సంవత్సరాల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయడంతో రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం-3, సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాక్లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయినట్లుగా ఆయన వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టంగా చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం ఉద్యోగ భద్రతను పెంపొందించడం తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్వయంగా ఉప ముఖ్యమంత్రి విక్రమార్క తెలిపారు. రానున్న రోజుల్లో గతంలో ప్రైవేట్ పరమైన కోయగూడెం-3 బ్లాక్, సత్తుపల్లి -3 బ్లాక్ల ను కూడా సింగరేణికి దక్కేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేవలం మన రాష్ట్రానికే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనుల సాధన, ఇతర క్రిటికల్ మినరల్స్ అన్వేషణలోనూ సింగరేణి విస్తరించడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ప్రభుత్వం ముందుకు ముందుకు వెళ్లడం శుభ పరిణామం. ఇదిలా ఉండగా మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ దక్కడంపై సింగరేణి యాజమాన్యానికి, కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులందరికీ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు కూడా తెలిపిన విషయం తెలిసిందే.

# ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్గా అర్వపల్లి అఖిల నాగ రమ్య

## చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ..

## ఉన్నత స్థాయికి ఎదిగిన నాగరమ్య




ఖమ్మం, ఆగస్టు 10(మనం న్యూస్): మామిళ్లగూడెంలో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది. ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తినా, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు. అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసాగించారు. విద్యార్థి దశ నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య, తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్గా బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపారు. విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధించిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాల, కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు. మామిళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

# రేపు 'రణము నాపవయ్య రామచంద్ర(శతకం) పుస్తకావిష్కరణ

ఖమ్మం, ఆగస్ట్ 10(మనం న్యూస్): ప్రముఖ కవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పొత్తూరి సీతారామారావు కలం నుండి జాలు వారిన ' రణము నాపవయ్య రామచంద్ర(శతకం)' పుస్తకావిష్కరణ ఈ నెల 12న బుధవారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో ఉన్న రోటరీ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ లో జరుగనుంది. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, జనవిజ్ఞాన వేదిక, జాషువా సాహిత్య వేదిక, అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రిటైర్డ్ ఎంఇఓ ఎస్వీఆర్ పురుషోత్తమరావు అధ్యక్షత న జరిగే ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథితులుగా యాదాద్రి టెంపుల్ కార్యనిర్వహణాధికారి జే.భవాని శంకర్ హాజరు కానున్నారని, ప్రముఖ కవి, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించనున్నారని నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు హరి శ్రీనివాస్, ప్రముఖ కవులు జీవన్, హెచ్‌వీఎల్ ప్రసాద్ బాబు, పురిమళ్ల సునంద తదితరులు హాజరయ్యే ఈ సభకు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిలాషులు, కవులు, రచయితలు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని రచయిత పొత్తూరి సీతారామారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

# మోడీ తీరు మారకుంటే పతనమే



- సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్
- అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు
- విజయవంతమైన జైల్ భరో
- వందలాది మంది అరెస్టు

ఖమ్మం, ఆగస్టు 10(మనం బ్యూరో): మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని నేతలు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, బానోత్ చంద్రావతి, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వి. కోటేశ్వరరావు, వై. ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి. రామయ్య, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు, కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత -వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమంటే కార్పొరేట్లకు కట్టబెట్టడమేనా అని ఆయన ప్రశ్నించారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. యాజమాన్యాల చేతుల్లో కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారని దీనిని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు. 12 ఏళ్ల కాలంలో మోడీ ఏ ప్రజా అనుకూల నిర్ణయాన్ని చేయలేదని ప్రజలను వంచించే ప్రయత్నంలోనే దశాబ్ద కాలం గడిపారని హేమంతరావు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తాయన్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడికంటి వెంకటరెడ్డి, శంకరయ్య, సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యే

- పొంగులేటి, పొన్నంతో కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో ఇండ్ల పంపిణీలో ఉద్రిక్తత

హైదరాబాద్, మనం ప్రతినిధి : హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. , గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆనాటి ప్రభుత్వం కొల్లగొట్టిన కారణంగా అనుకున్నన్నీ ఇంకా పూర్తిగా ఇవ్వలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు. మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. దీంతో పక్కన ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కలగజేసుకొని పొంగులేటిపై మండిపడ్డారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు' అని ఆయన పేర్కొన్నారు.

అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# సైబర్ మోసాలకు చెక్..

- కొరియర్, లాజిస్టిక్స్‌కు 1601 సిరీస్ కేటాయింపు

ఢిల్లీ, ఆగష్టు 10 : మొబైల్ ఫోన్లకు వచ్చే స్పామ్, మోసపూరిత కాల్స్ ను అరికట్టేందుకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ మరో కీలక చర్య తీసుకుంది. కొరియర్, లాజిస్టిక్స్, యుటిలిటీస్ సంస్థలు వినియోగదారులకు చేసే సేవా, లావాదేవీ సంబంధిత కాల్స్ కోసం 1601 సిరీస్ నెంబర్లను అమల్లోకి తీసుకురావాలని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది.

ప్రస్తుతం సాధారణ 10 అంకెల మొబైల్ నంబర్ల నుంచి వచ్చే కాల్స్ లో నిజమైన సంస్థల కాల్స్ ఏవో, మోసగాళ్ల కాల్స్ ఏవో గుర్తించడం వినియోగదారులకు కష్టంగా మారుతోంది. కొందరు మోసగాళ్లు విద్యుత్ సంస్థలు, కొరియర్ కంపెనీలు లేదా ఇతర సేవా సంస్థల పేర్లు చెప్పి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ట్రాయ్ 1601 అనే ప్రత్యేక నెంబర్ సిరీస్ ను కేటాయించింది. దీంతో వినియోగదారులు సేవా, లావాదేవీ సంబంధిత కాల్స్ ను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.



# తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయండి

- సుమారుగా లక్ష మంది ఉద్యమకారులకు న్యాయం చేయండి
- డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కె.వి కృష్ణారావు

ఖమ్మం, ఆగస్టు 10(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కె.వి కృష్ణారావు పేర్కొన్నారు. చిన్నారి హాస్పిటల్ డైరెక్టర్ ఆఫీస్‌లో రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం కరపత్రాన్ని ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కె.వి కృష్ణారావు మిగతా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో అమరవీరుల కుటుంబాలు ఉద్యమంలో గాయపడిన వారు, జైలుకుపోయిన వారు, ఉద్యమం నడిపిన వారు సంఘాలు ఏర్పాటు చేసిన వాళ్లందరిని కలిపి లక్ష మందిని గుర్తించాలని, వారికి 250 చదరపు గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని పిడమర్తి రవి కోరారు. సెప్టెంబర్ 16న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే అపూర్వ సమ్మేళనానికి 1969 - 2009 ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దేవి రెడ్డి విజయ్, మట్టె గురుమూర్తి, జిల్లా విజయ్, రాకేష్, భూక్య హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ఉద్యమం

- 50 గంటల పాటు ఆట.. పాట.. మాటల ప్రస్థానం
- సెప్టెంబర్ 26న ఉదయం పది గంటల నుంచి ప్రజా కళా జాతర ప్రారంభం
- విలేకరుల సమావేశంలో విమలక్క



ఖమ్మం ఆగస్టు 10(మనం న్యూస్): అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సాంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట.. పాట.. మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారు.

ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారు. తన జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన సందర్భంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుళ ప్రజా కళలు, జానపద కళారూపాలు, ప్రజా కళా జాతర, మనువాదంగా సంస్కృతి మూఢత్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను, శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉస్మానియాలో పురుడు పోసుకునేటప్పటికీ బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సాంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్థానం ఒక మరుపురాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను, కళాకారులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

# అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వ భూముల్లో దర్జాగా కట్టడాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు



**కాటారం, ఆగస్టు 10(మనం న్యూస్):** ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమ కట్టడాలను నివారించడం కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమల్లోకి తీసుకొచ్చి సీరియస్ గా వ్యవహరిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. కొందరు అధికారులు, పంచాయితీ సిబ్బంది అవినీతి, అలసత్వం మూలంగా గ్రామాల్లోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. కాలక్రమేణా ఆ ప్రభుత్వ భూముల్లో అదే అధికారుల అండతో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు సైతం జరుగుతున్నాయి. కాటారం మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యాదేచ్ఛగా జోరుగా కొనసాగుతున్నాయి. లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న సంబంధిత అధికారులు మిన్నుండి పోవడం పట్ల పలు అనుమానాలు రేకేత్తుతున్నాయి.

**అక్రమ నిర్మాణాల వెనుక అంతర్యం ఏంటి...!**

రేగులగూడెం జీపి పరిధిలో గత కొంత కాలంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికి అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టిన దాఖాలాలు లేవు. అక్రమ నిర్మాణాలపై అనునిత్యం ఫిర్యాదులు అందుతున్నప్పటికి అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనకడుతున్నారో... అట్టి నిర్మాణాల వెనక దాగివున్న అంతర్యం ఏంటో అంతు చిక్కకుండా మారిపోయిందని పలువురు చర్చించుకుంటున్నారు. పలుమార్లు ఫిర్యాదులు అందితే ఇటు పంచాయితీ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు ఏదో ఒక్కసారి స్పందించినట్లు వ్యవహరిస్తూ నామ మాత్రపు చర్యలకు పరిమితం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు ఇవ్వడం లేదా, నిర్మాణ పనుల వద్దకు పంచాయితీ అధికారులు వెళ్లడం పని అడ్డుకొని చిన్న చితక సామాగ్రి స్వాధీనం చేసుకోవడం, తిరిగి నిర్మాణదారులు తమ సామాగ్రిని తెచ్చుకోవడం పరిపాటిగా మారిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలు, నిర్మాణదారులపై అధికారులకు అంత ప్రేమ ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారో అని ప్రజలు చర్చిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై బలమైన చర్యలు తీసుకోకుండా నామమాత్రపు చర్యలకు మాత్రమే పరిమితం అవుతుందటంతో అధికారుల వ్యవహారంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కు గురై వెనకడుగు వేస్తున్నారా లేక మామూళ్ళ మత్తులో మిన్నుండి పోతున్నారా అని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

**అక్రమ నిర్మాణాల్లో అన్నివారై...**

ఈ అక్రమ నిర్మాణాల విషయంలో ఓ ఇద్దరు వ్యక్తులు ఓ అధికారి అన్ని వారై నడిపిస్తున్నట్లు తెలుస్తుంది. తమకు ఉన్న పలుకుబడితో వారు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నట్లు తెలిసింది. నిర్మాణం మొదలు నుండి పూర్తయ్యే వరకు ఎలాంటి అడ్డంకులు రాకుండా అన్ని తామే చూసుకుంటామని అభయమిస్తూ తమ తమ ప్యాకెజీలు జేబులో వేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏ రోజు నిర్మాణ పనులు చేయాలి.. ఏ రోజు నిలిపివేయాలి, ఎవరికి ఎంత ముట్టజెప్పాలి అని మొత్తం వీరి ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నట్లు వినికిడి.

# సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటనకు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**మేడారం: ఆగస్టు 10 ,మనం ప్రతినిధి,:** ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం వనదేవతలను దర్శించుకోనున్న నేపథ్యంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క మేడారంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగా కళ్యాణి, అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, సంపత్ రావ్, డిపిఓ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 నుంచి తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర

- తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్ వెల్లడి

**హనుమకొండ, ఆగస్టు 10 (మనం ప్రతినిధి):** సెప్టెంబర్ 17 నుంచి తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర చేపట్టనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఐక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్ వెల్లడించారు. సోమవారం అడాక్ కమిటీ సభ్యులు వోడవెల్లి శ్యాం కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అడహక్ కమిటీ సమావేశంలో సభ్యుల సలహాలు, సూచనల మేరకు ఈ నెల 15 నుంచి ప్రారంభం కావాల్సిన తెలంగాణ ఉద్యమకా ఓదార్పు యాత్రను 17 సెప్టెంబర్ నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ విలీనమైన రోజు, రజాకార్ల క్రూర హత్యాకాండ నుండి విముక్తి పొంది నైజాం నవాబుల నియంతృత్వ పరిపాలన అంతమైన రోజు గుర్తుగా 17 సెప్టెంబర్ను తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని నాటి హైదరాబాద్ ప్రాంత ప్రజలు దినంగా ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ చారిత్రక రోజు నుండే తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్రను వరంగల్ నగరంలో 1969లో నాటి కాసు బ్రహ్మానందరెడ్డి ఉద్యమకారులను విచక్షణ రహితంగా తుపాకీ తూటాలకు బలి చేశాడు నాటి ఉద్యమ స్మృతుల చిహ్నం సాక్షిగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రా చైర్మన్ ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్ ఉద్యమ ఓదార్పు యాత్ర ప్రారంభిస్తారని సభ్యులు తెలిపారు. అని తద్వారా ఉద్యమకారుల సంక్షేమానికి ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమ విజయానికి తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర నిర్వహణ కోసం 20 మందిని ఇన్చార్జీగా, జిల్లాల వారిగా 10 మంది ఇన్చార్జీలను నియమాలు నియమించడానికి సమావేశం తీర్మానించింది. ఈ సమావేశం కమిటీ సభ్యులు చాంద్ పాషా, ఎర్ర మనోహర్, అంజద్, రాంకుమార్, రాజమౌళి, స్వర్ణలత, పద్మా, ప్రభాకర్, నూతన్ ప్రసాద్, ఇమ్రాన్. తొలి దశ ఉద్యమకారుల హన్మకొండ కమిటీ కన్వీనర్ రామబ్రంహ చారి, వరంగల్ కమిటీ సభ్యులు రాయబారపు సుదర్శన్ న్యాయవాదులు, అనుముల రమేష్, రామగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

# కలెక్టర్ బంగ్లా ఎదుట రాస్తారోకో

- పోలీసుల తోపులాట..అరెస్టు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- కేంద్ర బిజేపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై జైల్ భరో




**హనుమకొండ, ఆగస్టు 10 (మనం ప్రతినిధి ):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో కేంద్రంలోని కార్మిక,రైతు సంఘాల పిలుపు మేరకు ఈరోజు హనుమకొండ లోని సుబేదారి కలెక్టర్ బంగ్లా ముందు వందలాదిమందితో సిఐటియు, ఏఐఏడబ్ల్యూ, ఏఐకేఎస్ సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో చేశారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించింది సుబేదారి సీఐ పోలీస్ బలగాలతో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘ నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత తోపులాట జరిగింది. అరెస్టు చేసిన వందలాదిమంది సుబేదారి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి అరగంట పాటు ధర్నా చేశారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి లేబర్ కోడులను రద్దు చేయాలి జిరాంజీ బిల్లును ఉపసంహరించుకోవాలి,విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలి, అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ₹సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగల రమేష్₹ మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బిజెపి అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు రైతులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు గడిచిన 12 సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అమ్మకం చేస్తుందని వ్యవసాయ కూలీలకు మేలు చేసే గ్రామీణ ఉపాధి హామీ, పథకాన్ని రద్దుచేసి జి రామ్ జి బిల్లు తేవడంతో ఉపాధి కూలీలకు పరి గ్యారెంటీ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు విద్యుత్తు ప్రైవేటీకరణ కోసం కొత్తగా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్లో తీసుకొచ్చారని తక్షణమే దానిని రద్దు చేయాలని రాగుల రమేష్ డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రాములు₹ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలో ఉన్నది. దాన్ని గత పార్లమెంట్ సమావేశాల్లో 2025 విద్యుత్ సవరణ బిల్లు'గా ఆమోదించడం జరిగింది. ఈ చట్ట ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలు కేంద్రం చూస్తుంది. విద్యుత్ ఛార్జీలను కూడా కేంద్రమే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా నిర్ణయిస్తుంది. స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేస్తారు. ఉచిత విద్యుత్ రద్దు చేస్తారు. క్రాస్ సబ్సిడీ రద్దు చేయడం వల్ల వినియోగదారులందరు ఉత్పత్తి ఖర్చు చెల్లించాలి. విదేశాల నుండి విద్యుత్తు దిగుమతి చేసుకోవచ్చు, దీంతో రాష్ట్రాల హక్కులు పూర్తిగా హరించబడతాయి. సాంప్రదాయ విద్యుత్ (సోలార్) వినియోగం పేరుతో ఛార్జీలు పెంచుతారు. ప్రస్తుతం దేశంలో లక్ష కోట్లు విద్యుత్ బాకీలు ఉన్నాయి. ఇవి మరింత పెరుగుతాయి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ ప్రైవేట్ సంస్థలు హస్తగతం చేసుకొని లక్షల కోట్ల లాభాలు సంపాదిస్తాయి, అన్నారు ఈ ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ మెట్టు రవి, వీ శ్రీనివాస్, పి రవి, జే సుధాకర్, రజిత, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య మంద సంపత్, ఎన్ రమ,సునీత, కళావతి, అనిల్, చిరంజీవి, గొడుగు వెంకట్, కే లింగయ్య శివాజీ, ప్రేమలత లతో పాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు

# బ్యాంకింగ్ సేవలపై.. లోక్‌సభలో గళమెత్తిన ఎంపీ కావ్య

**హనుమకొండ ఆగష్టు 10(మనం ప్రతినిధి):** వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్ధన్ యోజన కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు.)వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే సమయంలో ఆధార్తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు చేరాయి. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయి. జన్ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను మరింత విస్తరించి, మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలి అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి



- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి ఆగస్టు 10 మనం న్యూస్:** బోనాల జాతర మన సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీక అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పైలట్ కాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన భూపాలపల్లి జిల్లా డాన్స్ అసోసియేషన్ బోనాల జాతర కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ బోనాల జాతర తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డాన్స్ అసోసియేషన్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఆధునికత వైపు అడుగులు వేస్తూనే మన సంస్క ృతి, సంప్రదాయాలు ఎన్నటికీ మర్చిపోవద్దని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి పాఠశాలలో డాన్స్, సాంస్క ృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.

# విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఎన్నిక

**మహాదేవపూర్, 10 మనం న్యూస్ :** విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం మహాదేవపూర్ మండల నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలోని శివ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వీణవంక శ్రీనివాస్ చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదారపు రమేష్ చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చీర్లవంచ రమేష్ చారి, భూపాలపల్లి జిల్లా పట్టణ అధ్యక్షుడు కృష్ణ చారి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.మండల అధ్యక్షునిగా చల్లూరి సదానంద చారి ప్రధాన కార్యదర్శిగా చీర్లవంచ సుధాకర్ చారి కోశాధికారిజ్జీలారపు సదాశివ చారి గౌరవ అధ్యక్షునలుగా ఆరెందల అంకన్న చారి చీర్లవంచ దశరథం చారి ఉపాధ్యక్షులు గా వంగల శివ చారి పూసాల నగేష్ చారి నగునూరి బ్రహ్మ చారివంగల సుదర్శన్ చారి మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు గా వంగల నాగరాజు చారి తిమ్మరాజం బ్రహ్మ చారి సహాయ కార్యదర్శులు గా తాటికొండ కేశవ చారి మడిరోజు శివ చారి తొందల రమేష్ చారి ముప్పిడి జగదీశ్ చారి జీలారపు తిరుపతి చారి ప్రచార కార్యదర్శులుగా రంగు మహేష్ చారి పూసాల సతీష్ చారి ముఖ్య సలహాదారుగా చీర్లవంచ రమేష్ చారిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను పలువురు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు చల్లూరి సదానంద చారి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని, సభ్యులందరినీ కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# ఆర్డీఎఫ్ జూనియర్ కళాశాలలో ఘనంగా వెల్కమ్ పార్టీ

**పర్వతగిరి, ఆగస్టు 10 (మనం న్యూస్):** పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్ వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో సోమవారం వెల్కమ్ పార్టీని ఘనంగా నిర్వహించారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఆటపాటలు, సాంస్క ృతిక ప్రదర్శనలతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, బంధనపల్లి గ్రామ సర్పంచ్ అక్రి రామ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అక్రి రామ్ జీని శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్క ృతిక కార్యక్రమాలకు కళాశాలలో సముచిత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని చెప్పారు. వెల్కమ్ పార్టీ సం దర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు చేసిన ఉపన్యాసాలు, పాటలు, నృత్యాలు, వివిధ సాంస్క ృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్, అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్యా, విల్సన్ బాబు, వేణు, గుంషావళి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి, తిరుమల, పిడి బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు రహితంగా కర్రెగుట్టలు

- శాంతికి చిహ్నంగా పావురాలు ఎగురవేసిన డీజీపీ సీవీ ఆనంద్
- పాముసూరు-ఛత్తీస్గఢ్ రహదారి పనుల పరిశీలన




**ములుగు, ఆగస్టు 10 ,మన ప్రతినిధి:** దశాబ్దాలుగా మావోయిస్టు ప్రభావంతో ఉన్న కర్రెగుట్టల ప్రాంతం ఇక మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం సర్కిల్ పరిధిలోని పాముసూరు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపును ఆయన సందర్శించారు.పాముసూరు నుంచి ఛత్తీస్గఢ్ వరకు నిర్మించనున్న రహదారి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కర్రెగుట్టల్లో పోలీసు జెండాను ఎగురవేసి.. శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేశారు.అభివృద్ధికి బాటసుమారు 50-60 ఏళ్లుగా మావోయిస్టు ప్రాబల్యం ఉన్న కర్రెగుట్టల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని డీజీపీ పేర్కొన్నారు. పాముసూరు బేస్ క్యాంపు నుంచి ఛత్తీస్గఢ్ వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజా రవాణాకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్లో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు.ఆదివాసీలకు అండపాముసూరులోని గ్రామస్థులకు డీజీపీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసుశాఖ తరఫున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వీడి పోలీసుల ఎదుట లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం, అవసరమైన సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ, ఐజీ, ములుగు జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, సీఆర్పీఎఫ్ అధికారులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు





# సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, ఆగస్టు 10 (మనం న్యూస్):** పరకాలలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సభను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్, పరకాల, నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశా. నిర్వహించారు.

ఈ నెల 16వ తేదీన పరకాల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బూత్ లెవెల్ నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి, ప్రజలను ఎత్తున సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కమిట్మెంట్ తో కూడిన బలమైన ఆర్గనైజేషన్తో ప్రతి గ్రామం, ప్రతి బూత్లో సమన్వయంతో పనిచేస్తే సభ చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని అన్నారు. సభ ఏర్పాట్లు. ప్రజల రవాణా, ప్రచార కార్యక్రమాలు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తరిగిపోతున్న ఆయుధ నిల్వలపై కలవరం!

- ఆందోళనలో అమెరికా రక్షణశాఖ
- ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయుధ కంపెనీలపై ఒత్తిళ్లు



**వాషింగ్టన్, ఆగష్టు 10 :** హరించుకుపోతున్న ఆయుధ నిల్వల్ని పెంచడానికి ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయుధ కంపెనీలపై అమెరికా రక్షణశాఖ ఒత్తిడి తెస్తోంది. దూకుడుగా ఉత్పత్తి పెంచే ప్రణాళికల్ని 3 వారాల్లోగా సమర్పించాలని రక్షణ పరిశ్రమలకు ఆ శాఖ ఉప మంత్రి స్టీవ్ ఫీన్‌బర్గ్ 4 రోజుల క్రితం లేఖ రాశారు. కీలక సామర్థ్యాలను అవి పెంచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి సమయం తీసుకుంటామంటే అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికిప్పుడు ప్రణాళికల్ని మార్చుకుని, ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

దాదాపు 5 నెలలుగా ఇరాన్ యుద్ధం కొనసాగుతున్నందువల్ల ఆయుధాల నిల్వలు తరిగిపోతున్నాయి. ముప్పును ఎదుర్కొనేందుకు తమ సైనికులకు కావాల్సిన ఆయుధాల నిల్వల పెంపుపై చురుగ్గా దృష్టి సారించామని పెంటగాన్ అధికార ప్రతినిధి సియాన్ పార్నెల్ ధ్రువీకరించారు. విస్తృత ఆధునికీకరణలో ఇదొక భాగమని చెప్పారు.

క్షిపణులను ఛేదించే అధునాతన ఆయుధ నిల్వలను అమెరికా సైన్యం ఇటీవలి కాలంలో ఎక్కువగా వినియోగిస్తోంది. ఇప్పటికే తక్కువగా ఉన్న ఆయుధాలు ఇప్పుడు మరింత తగ్గిపోవడంతో క్షేత్రస్థాయి బలగాలు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తుతోంది. యుద్ధ తీవ్రత పెరిగితే ఇది ఇంకా సమస్య అవుతుందనే ఉద్దేశంతో రక్షణశాఖ తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. అమెరికా, పశ్చిమాసియాలోని మిత్రపక్షాలు ఇప్పటికే గగనతల రక్షణ వ్యవస్థల్ని ఆచితూచి వాడాల్సిన పరిస్థితి వచ్చింది. దానివల్ల ప్రమాదం పొంచి ఉంటోంది. యుద్ధానికి ముందు పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల సంఖ్య 2,330 ఉంటే ఏప్రిల్లో 1,030కి, ప్రస్తుతం 827కి తగ్గిపోయింది. థాడ్ ఇంటర్‌సెప్టర్లు 452 నుంచి 232-262కి తగ్గాయి. మధ్యలో కొన్నింటిని సమకూర్చుకున్నా ప్రస్తుతం 234-278కి మించబోవని, ఇది యుద్ధానికి ముందున్న నిల్వకంటే 38% తక్కువని తెలుస్తోంది.

నిల్వలు లేక.. ఇరాన్ డ్రోన్లను అడ్డుకునేందుకు అమెరికా దళాలు తక్కువ క్షిపణుల్ని వాడాల్సి వస్తుందని, అలాంటి సమయంలో ఒక్క డ్రోన్/ క్షిపణి తప్పించుకుని వచ్చినా ప్రమాదమేనని వాషింగ్టన్‌లోని 'వ్యూహాత్మక, అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రం' విశ్లేషిస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఆయుధాల కొరతను అంగీకరించడం లేదు. కుప్పలుతెప్పలుగా అవి తమవద్ద ఉన్నాయని, అవసరమైనప్పుడు నౌకల్లో తరలివచ్చేందుకు పెద్ద ఎత్తున తయారవుతున్నాయని ఇటీవల ఆయన స్పష్టం చేశారు. రక్షణశాఖ బడ్జెట్ పెంచే బిల్లు అమెరికా కాంగ్రెస్‌లో ముందుకు కదలడం లేదు. కేటాయింపులను 90,000 కోట్ల డాలర్ల నుంచి ఒకేసారి 1,50,000 కోట్ల డాలర్లకు పెంచడానికి శాసనకర్తలు వ్యతిరేకిస్తున్నారు.



## యెమెన్ రేవుపై హూతీల దాడి

- ఏడుగురి మృతి..
- సౌదీలో ఆరాంకో రిఫైనరీపైనా బాంబులు

**సనా, ఆగష్టు 10 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎర్ర సముద్ర తీరంలో యెమెన్‌కు చెందిన కీలక మోఖా ఓడరేవుపై హూతీ తిరుగుబాటుదారులు తాజాగా క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. మృతుల్లో యెమెన్‌కు చెందిన నలుగురు సైనికులు, ముగ్గురు సాధారణ పౌరులు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు-సౌదీ అరేబియాలోని జజాన్ నగరంలో ఆరాంకో రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని తాము దాడి చేసినట్లు హూతీలు ప్రకటించారు. ఈ దాడితో రిఫైనరీలో మంటలు చెలరేగాయని, అయితే ఎవరూ మరణించలేదని సౌదీ ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది.

## హర్మూజ్‌లో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడి..

**టెహ్రాన్, ఆగష్టు 10 :** హర్మూజ్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ జల సంధిలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో పక్కనే ఉన్న మరో చమురు నౌక కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఇవి ఏ దేశానికి చెందిన ట్యాంకర్లు, సిబ్బంది ప్రాణాలతో ఉన్నారా లేదా అనే వివరాలు తెలియాల్సి ఉంది. హర్మూజ్‌లోని జల మార్గాలపై ఒమన్‌తో అమెరికా చర్చలు జరుపుతున్న వేళ ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు దక్షిణ ఇరాన్ గగనతలంలో చక్కర్లు కొడుతున్న అగ్రరాజ్య ఎంక్యూ-9 డ్రోన్‌ను ఐఆర్జీసీ దళాలు కూల్చివేశాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.



ఇదిలా ఉండగా.. సౌదీ అరేబియా-హూతీల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. సౌదీ సైనికులే లక్ష్యంగా ఓడరేవుపై జరిపిన దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇక, అరాంకోకు చెందిన జాజన్ రిఫైనరీపైనా హూతీలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఈ ఘటన కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. దీంతో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు. ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా.. ఇటీవల పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా 'మక్కా ఒప్పందం' కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీని ప్రకారం ఏ ఒక్కదానిపై దాడి జరిగినా దాన్ని మిగిలిన రెండు దేశాలపైనా దాడిగా పరిగణించి కలిసికట్టుగా ఎదురు తిరుగుతాయి. ఈ డీల్ కుదుర్చుకున్న కొన్ని రోజుల్లోనే హూతీలు సౌదీపై దాడులు చేయడం గమనార్హం. దీంతో ఇప్పుడు పరిస్థితులు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

## 'సముద్రంలో చిక్కుకుపోయినా.. పట్టించుకోలేదు'..

- జుకర్ బర్గ్ నౌకపై విమర్శలు

**అలస్కా , ఆగష్టు 10 :** సముద్రంలో చిక్కుకుపోయిన ఓ బోటును రక్షించేందుకు ముందుకు రాలేదని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు చెందిన విలాస నౌకపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈమేరకు సిగ్నల్స్ అందినప్పటికీ ఆ నౌక పట్టించుకోలేదనే ఆరోపణలు వచ్చాయి. అలాస్కా తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చివరకు మరో నౌక వచ్చి దానిని కాపాడినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

పీటర్స్‌బర్గ్, జూనో మధ్య ప్రయాణిస్తున్న 21 అడుగుల ఓ బోటు.. ఇంధనం అయిపోవడంతో ఆగ్నేయ అలాస్కాలోని కుయు ద్వీపం సమీపంలో నిలిచిపోయింది. దీంతో ఆ బోటులోని వ్యక్తులు యూఎస్ కోస్ట్‌గార్డ్‌ను సంప్రదించారు. సమీపంలోని నౌకలు ఆ పడవకు సాయం అందించాలని యూఎస్ కోస్ట్‌గార్డ్ సూచనలు జారీ చేసింది. స్థానిక మీడియా ఉటంకించిన షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఆ సమయంలో జుకర్‌బర్గ్‌కు చెందిన 387 అడుగుల పొడవైన విలాస నౌక 'లాంచ్‌ప్యాడ్', దాని సహాయక నౌక 'వింగ్‌మ్యాన్'.. ఆ బోటుకు సమీపంలోనే ఉన్నట్లు



వెల్లడైంది. అయినప్పటికీ.. దూరంగా ఉన్న 'ఎంవీ వైల్డర్‌నెస్ లెగసీ' అనే మరో క్రూజ్ షిప్ తన దారిని మార్చుకుని, ఆ బోటుకు సాయం చేయాల్సి వచ్చిందని తేలింది. 'ఎంవీ వైల్డర్‌నెస్ లెగసీ'లోని ఓ ప్రయాణికుడు మాట్లాడుతూ.. ఆ పడవకు 'లాంచ్‌ప్యాడ్' దగ్గరగా ఉన్నప్పటికీ రెస్క్యూ అభ్యర్థనకు స్పందించలేదంటూ తమ కెప్టెన్ చెప్పాడన్నారు. అయితే, 'లాంచ్‌ప్యాడ్' సిబ్బంది అప్పటికే వేరే రేడియో ఛానెల్‌ను పర్యవేక్షిస్తున్నారని.. సహాయక చర్యలు ప్రారంభమైన తర్వాతే వారికి ఈ విషయం తెలిసిందని జుకర్‌బర్గ్ ప్రతినిధి తెలిపారు. ఆ సమయంలో నౌకలో జుకర్ బర్గ్ లేరని చెప్పారు.

### యుద్ధం మొదలైనప్పటి నుంచి..

## రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద డ్రోన్ దాడి

**కీవ్, ఆగష్టు 10 :** రష్యాపై ఉక్రెయిన్ పెద్ద డ్రోన్ దాడులకు పాల్పడింది. నాలుగేళ్ల క్రితం యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మాస్కోపై కీవ్ చేసిన దాడుల్లో ఇదే అతిపెద్దదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించారు. ఈ దాడుల్లో 13మంది ప్రాణాలు కోల్పోగా 75మంది తీవ్రంగా గాయపడ్డారు. 21మంది పరిస్థితి



విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో సొంత పౌరులతో పాటు విదేశీయులు కూడా ఉన్నట్లు రష్యా వెల్లడించింది. 456 ఉక్రేనియన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నిజ్నెకామస్క్ నగరంలోని చమురు శుద్ధి క్షేత్రం సహా పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు కీవ్ ప్రకటించింది. రష్యా సైనిక సామర్థ్యాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా ఆ దేశానికి కీలక ఆదాయ మార్గాలైన చమురు క్షేత్రాలపై దాడులు చేస్తున్నట్లు తెలిపింది. సోమవారం రష్యా కూడా ఉక్రెయిన్‌లోని అనేక ప్రాంతాలపై భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 5మంది ప్రాణాలు కోల్పోయారని.. అనేక నివాసాలు ధ్వంసమయ్యాయని కీవ్ సైనిక వర్గాలు వెల్లడించాయి. తమ దేశంలోని పలు ప్రాంతాలపై రష్యా 126 డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. దాదాపు పదివేల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొంది.



## తాత్కాలిక ఒప్పందానికి చేరువలో ఇరాన్, ఒమన్

**కైరో, ఆగష్టు 10 :** హర్మూజ్‌ను తిరిగి తెరిచేలా తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్, ఒమన్ చేరువలో ఉన్నాయి. నౌకలు ఇరాన్‌కు చేరువలోని మార్గం ద్వారా జల సంధిలో ప్రవేశించి ఒమన్‌కు సమీపంలోని మార్గం ద్వారా నిష్క్రమించేలా అవి అంగీకారం కుదుర్చుకోనున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రస్తుతానికి టోల్ ఏమీ వసూలు చేయరనీ తెలుస్తోంది. అమెరికా తన ప్రవర్తనను మార్చుకునేంతవరకూ హర్మూజ్‌ను తెరవబోమని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి పేర్కొంది. తమను వాషింగ్టన్ ఇంకెప్పుడూ బెదిరించకూడదని, యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని, తమ పోర్టుల దిగ్బంధాన్ని ఎత్తివేయాలని అది డిమాండ్ చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన గాజా ప్రణాళికను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తిరస్కరించారు. హమాస్ తిరుగుబాటుదారులు ఆయుధాలను పూర్తిగా త్యజించే వరకూ గాజా నుంచి తమ బలగాలను ఉపసంహరించుకోబోమని ఆయన ఆదివారం ప్రకటించారు.

# నమ్మించి.. నట్టేట ముంచారు!

- జాయింట్ వెంచర్ పేరిట రూ.5 కోట్ల హోటల్ కబ్జా
- లీజ్ పత్రాలు ఫోర్జరీ చేసి, బ్రాండ్ మార్చేసి దందా
- కోర్టు ఆదేశాలతో సౌజన్య జూపల్లి సహా ఏడుగురిపై రాయదుర్గం పీఎస్‌లో కేసు నమోదు

**హైదరాబాద్,ఆగష్టు 10(మనం న్యూస్):** వ్యాపారంలో భాగస్వామిగా చేర్చుకున్న పాపానికి.. సదరు యజమానిని నిలువునా ముంచేశారు. భవన యజమానితో కుమ్మక్కై, లీజు పత్రాలపై సంతకాలను ఫోర్జరీ చేసి ఏకంగా రూ.5 కోట్ల విలువైన హోటల్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. బ్రాండ్ పేర్లు మార్చేసి కొత్త పేరుతో హోటల్ నడుపుతూ, అసలు యజమానిని బెదిరింపులకు గురిచేస్తున్న ఉదంతం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదుపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**రూ.5 కోట్ల పెట్టుబడిః**

పోలీసుల కథనం ప్రకారం.. 'ఎలెవెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్' మేనేజింగ్ డైరెక్టర్ టి.కాంతి దత్ ఖాజాగూడలో 'నామి పాటిస్సేరీ', 'దక్షింకత' పేర్లతో రెస్టారెంట్లు, బేకరీలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం భవన



యజమానితో 10 ఏళ్ల లీజ్ అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. 2023 జూన్‌లో జాయింట్ వెంచర్ కోసం సౌజన్య జూపల్లి ఈ సంస్థను సంప్రదించారు. ఖాజాగూడ ఔట్‌లెట్‌లో 35 శాతం వాటా కోసం ఆమె రూ.కోటి పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించడంతో ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదిరింది. అనంతరం 'శ్రీ సమీరా హాస్పిటలిటీ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేశారు. ఇందులో ఎలెవెన్ ఫుడ్స్‌కు 65 శాతం, సౌజన్యకు 35 శాతం వాటాలు ఉన్నాయి. లీజ్ అడ్వాన్స్, ఇంటీరియర్, యంత్రాలు, ఇతర పరికరాల కోసం కాంతి దత్ సుమారు రూ.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు.

**బాధ్యతలే ఆసరాగా కుట్రః**

కాంతి దత్ ఇతర వ్యాపారాల్లో బిజీగా ఉండటంతో హోటల్ రోజువారీ నిర్వహణ బాధ్యతలను సౌజన్యకు అప్పగించారు. దీన్ని ఆసరాగా చేసుకుని సౌజన్యతో పాటు అక్షయ్ నాగ్ కమని, సుమంత్ మణుకొండ, దీపికా రాజు, సర్దార్ నౌనిహాల్ సింగ్, రామ రుద్ర నూనె, సునీత నూనెలు కలిసి కుట్రకు తెరలేపారు. కాంతి దత్‌కు తెలియకుండా, ఆయన అనుమతి లేకుండా లీజ్ పత్రాలను ఫోర్జరీ చేశారు. పాత లీజ్ అగ్రిమెంట్‌ను అక్రమంగా రద్దు చేసి, భవన యజమానితో కలిసి కొత్త లీజ్ డీడ్‌లు సృష్టించారు. అనంతరం ప్రాంగణంతో పాటు రూ.5 కోట్ల విలువైన యంత్రాలు, కంపెనీ ఆస్తులన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకుని,'నామి పాటిస్సేరీ', 'దక్షింకత' బోర్డులను తొలగించి, అదే ప్రాంగణంలో 'కేఫ్ ఫ్లైన్' పేరుతో కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించారు. తన వ్యాపార ఆస్తులను, ప్రాంగణాన్ని తిరిగి అప్పగించాలని కోరిన కాంతి దత్‌పై నిందితులు దూషణలకు దిగి, దాడి చేసి తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. కంపెనీకి చెందిన సంతకం చేసిన చెక్కుబుక్కులు, అసలు ఆస్తి పత్రాలు, ఇతర కీలక రికార్డులను బలవంతంగా తమ వద్దే ఉంచుకుని, వాటిని తిరిగి ఇవ్వాలంటే రూ.2 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంతకం చేసిన చెక్కులను దుర్వినియోగం చేసి తప్పుడు చెక్ బౌన్స్ కేసులు పెట్టిస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**రంగంలోకి దిగిన పోలీసులుః**

బాధితుడు కాంతి దత్ పోలీసులను ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆదేశాల మేరకు రాయదుర్గం పోలీసులు రంగంలోకి దిగారు. ప్రధాన నిందితురాలు సౌజన్య జూపల్లితో పాటు ఏడుగురిపైభారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 61, 304, 308, 316, 318, 336, 340, 338, 351(2) రీడ్ విత్ 3(5) కింద, అలాగే బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 175(3) కింద కేసులు నమోదు చేసిన పోలీసులు,ఈ భారీ హోటల్ కబ్జా ఉదంతంపై దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఫస్ట్ లేడీ 'టాప్ గన్'.. భావనా కాంత్

- వాయుసేనలో మరో రికార్డు సృష్టించిన మహిళా ఫైటర్ పైలట్

**ఢిల్లీ, ఆగష్టు 10 :** భారత వాయుసేనలో మరోసారి హద్దులు చెరిపేస్తూ స్క్వాడ్రన్ లీడర్ భావనా కాంత్ నవ చరిత్ర సృష్టించారు. ఇప్పటివరకు పురుషులే సాధించిన ఫైటర్ కాంబాట్ లీడర్ కోర్సును విజయవంతంగా పూర్తిచేశారు. దేశంలోనే తొలి లేడీ 'టాప్ గన్'గా గగనతలంలో తన పేరును లిఖించుకున్నారు.

మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో గల టాక్టిక్స్ అండ్ ఎయిర్ కాంబాట్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో భావనా కాంత్ ఈ ఫైటర్ కాంబాట్ లీడర్ కోర్సును పూర్తి చేశారు. భారత వాయుసేనలో అత్యాధునిక పోరాట శిక్షణగా పేర్కొనే ఈ కోర్సును 20 వారాల పాటు నేర్చుకోవాలి. ఎంపిక చేసిన ఫైటర్ పైలట్లను మాత్రమే ఈ శిక్షణకు పంపిస్తారు. కేవలం 100 పైలట్లలో ఒకరికి మాత్రమే ఈ అవకాశం దక్కుతుంది. అలాంటి కఠినమైన శిక్షణకు భావన ఎంపికవ్వడం విశేషం.

**తొలి 'టాప్ గన్'గా మారి..**

అధునాతన పోరాట వ్యూహాలు, మిషన్ ప్రణాళిక, ఎయిర్ టు ఎయిర్, గగనతల-భూతల ఆపరేషన్లు, అధిక తీవ్రత ఉండే ఆపరేషన్లలో నాయకత్వం వంటి అంశాలలో యుద్ధ విమాన పైలట్లకు ఖీఅఇృఉ శిక్షణ ఇస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసిన పైలట్లు.. సంక్లిష్టమైన గగనతల పోరాట మిషన్లకు నాయకత్వం వహిస్తారు. యుద్ధ క్షేత్రంలో ముందుండి పోరాడేందుకు వీరు అర్హత సాధిస్తారు. అమెరికా నేవీలోని స్ట్రైక్ ఫైటర్ టాక్టిక్స్ ప్రోగ్రామ్ అయిన 'టాప్ గన్'తో దీన్ని పోలుస్తారు. అందువల్ల ఇది ఐఏఎఫ్ 'టాప్ గన్' కోర్సుగా పేరొందింది. ఇంతకుముందు ఈ కోర్సు పూర్తిచేసిన మహిళా ఫైటర్ పైలట్లు ఎవరూ లేరు. ఇప్పుడు దాన్ని భావన చెరిపేసి.. తొలి 'టాప్ గన్' పైలట్గా మారారు.

**పదేండ్ల క్రితమే చరిత్ర లిఖించి..**

భారత వాయుసేన చరిత్రలో భావనా కాంత్ తన పేరును పదేళ్ల క్రితమే సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. 2016లో ఐఏఎఫ్లో ఫైటర్ పైలట్లుగా ఎంపికైన తొలి ముగ్గురు అధికారిణుల్లో ఈమె ఒకరు. అవని చతుర్వేది, మోహనా సింగ్తో కలిసి ఆమె ఈ ఘనత సాధించారు. అప్పటి నుంచి వాయుసేనలో అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. 2019లో పగటిపూట యుద్ధ విమాన పోరాట



కార్యకలాపాలను చేపట్టడానికి అనుమతి పొందిన తొలి భారత మహిళగా ఆమె నిలిచారు.

తొలినాళ్లలో మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలను నడిపిన ఆమె.. ఆ తర్వాత సు-30 ఎంకేఐ ఫైటర్ జెట్లను నడుపుతున్నారు. 2021లో గణతంత్ర దినోత్సవ పరేడ్లో పాల్గొని ఈ ఘనత సాధించిన తొలి మహిళా ఫైటర్ పైలట్గా నిలిచారు. ఆ తర్వాత 2024లో జరిగిన గణతంత్ర వేడుకల్లో వాయుసేన విన్యాసాల్లో పాల్గొని మరో రికార్డు సృష్టించారు. తాజాగా ఆమె 'టాప్ గన్' శిక్షణ పూర్తిచేసుకోవడంతో వాయుసేన పోరాటాల్లో పరిపూర్ణ యోధురాలుగా మారారనడంలో ఎలాంటి సందేహం లేదు.

**బీహార్ చెందిన భావనా..**

బిహార్ రాష్ట్రం దర్భంగా జిల్లాలోని ఓ చిన్న పట్టణంలో భావనా కాంత్ 1992లో జన్మించారు. ఆమె తండ్రి తేజ్ నారాయణ్.. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్లో ఎలక్ట్రికల్ ఇంజినీర్. తల్లి రాధా కాంత్ గృహిణి. బెంగళూరులోని బీఎంఎస్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి 2014లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆమె.. కెరీర్ తొలినాళ్లలో ఓ ఐటీ కంపెనీలో పనిచేశారు. అయితే, చిన్నప్పటి నుంచే భావనకు విమానాలు నడపాలనే కల ఉండేది. దీంతో ఎయిర్ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ రాసి.. వాయుసేనకు ఎంపికయ్యారు. హైదరాబాద్లోని హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో ట్రైనింగ్ పూర్తయ్యాక.. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ నుంచి ఫ్లయింగ్ ఆఫీసర్గా బయటకు వచ్చారు. 2020లో నాటి రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు.

## ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది



- మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, ఆగష్టు 10 :** వైద్య విద్యార్థిని ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. గాంధీ ఆస్పత్రి మార్చురీలో ఉన్న ప్రియాంక భౌతికకాయం దగ్గర మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ నివాళులు అర్పించారు. ప్రియాంక తండ్రిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రియాంక ఘటన అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్రెడ్డి వెంటనే స్పందించి తమకు, అధికారులకు ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమని చెప్పుకొచ్చారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని నిందితులు తప్పించుకోకుండా కఠినతరం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

# సాగర్‌లో యాగానికి వెళ్తూ అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



నాగార్జున సాగర్‌లో నిర్వహించిన
వరుణ యాగంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు









## ప్రజావాణి సమస్యలపై వెంటనే పరిష్కారం చూపాలి



**సూర్యాపేట ఆగస్టు 10 (మనం ప్రతినిధి):** ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పి పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం సాధ్యం



**సూర్యాపేట ఆగస్టు 10 (మనం ప్రతినిధి):** బహుజన వర్గాలు రాజ్యాధికారం చేపట్టినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోనల్ ఇంచార్జ్ రవీంద్ర నాయక్ రావడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారం పొందనంతవరకు సామాజిక సమస్యల శాశ్వత పరిష్కారం దొరకదు. మహనీయుల ఆలోచన విధానంలో గ్రామ గ్రామాన బూత్ సెక్టార్ కమిటీల నిర్మాణం చేయాలి. పిసిఏసి ఎస్టి మరి మైనార్టీల సంక్షేమం కోసం వాళ్ళ హక్కులు ఆత్మగౌరవం అధికారం కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మిషనరీ మూమెంట్ ఒకటే మార్గమని చెప్పడం జరిగిందని పేర్కొన్నారు.మన సమాజంలో పెద్ద సమస్య ఏంటంటే మన బీసీ ఎస్సీ ఎస్టీ మరి మైనార్టీ ప్రజలు నిద్రలో ఉన్నారు, వారిని మేలుకొలపాలి తమ బలం ఏంటో తెలియజేయాలి, వారి హక్కులు వారి సంఖ్య వారి శక్తి రాజ్యాధికారం అని వారికి తెలియదు. కాబట్టి మన బహుజన సమాజాని జాగ్రత్త శక్తి మిషనరీ నడిపించే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ అని మన అందరి బాధ్యత అని తెలియజేశారు. నిరంతరం పోరాటం చేస్తేనే రాజ్యాధికారం వస్తుందని, రాజ్యాధికారం దిశగా బీసీ ఎస్సీ ఎస్టీ మరి మైనార్టీ ప్రజలను నడిపించే బాధ్యత మన అందరిపై ఉన్నదని, ఇప్పటికే అగ్రకులాల పార్టీలు పాలక ప్రభుత్వాలు బీసీఈసీ ఎస్టీ మరియు మైనార్టీ ప్రజలను అబద్దాల హామీలతో ఇప్పటికి మోసం చేస్తున్నారు.కార్పొరేట్ విద్యా వ్యవస్థ అత్యధిక ఫీసులు వసూలు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికి పట్టించుకోవడం లేదు అంటే పాలక ప్రభుత్వాలు మరియు ప్రతిపక్షాలు దీని గురించి మాట్లాడటం లేదంటే అన్ని పార్టీలు ఒకటేనని మీకు తెలియజేస్తున్నాను. మన అధికారాన్ని హక్కులను ఆత్మ గౌరవాన్ని సామాజిక పరివర్తన ఉద్యమాన్ని నడిపించేది మనకు న్యాయం చేసేది ఏదైనా ఉన్నది అంటే అది బహుజన్ సమాజ్ పార్టీ అని మీకు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమం లో నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్ లు మామిడి స్టాలిన్ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి గుడ్డు కిరణ్ .అసెంబ్లీ అధ్యక్షులు చెరుపల్లి లక్ష్మణ్ సూర్యాపే ట అసెంబ్లీ అధ్యక్షుడు చింత నవీన్ వివిధ అసెంబ్లీ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత నివ్వాలి

- జెడ్పి సిఈఓ శిరీష.



**కోదాడ//నడిగూడెం, ఆగష్టు 10(మనం న్యూస్):** ఏల్ నినో ప్రభావంతో వర్షాబావ పరిస్థితులు అనుకూలంగా లేనందున ఆరుతడి పంటలు సాగు చేయాలని జడ్పీ సీఈవో శిరీష కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో రైతులతో మాట-పంట మార్పిడికి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగర్ కాలువ ద్వారా సాగు నీరు వచ్చే పరిస్థితి లేనందున వరి పంటను సాగు చేసి రైతులు నష్టపోవద్దని ప్రభుత్వం రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తుంది అన్నారు. రైతులు వరికి బదులుగా ఇతర ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలైన మినుములు, బొబ్బర్లు ఉలువలు, కూరగాయ పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయుటకు రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆరుతడి పంటలు సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం విత్తనాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ, మండల ప్రత్యేక అధికారి దామోదర్ రెడ్డి, ఎంపీడీవో మల్సూర్ నాయక్, సర్పంచి దున్నా శ్రీనివాస్, ఏఈఓ వెంకటరెడ్డి, జిపిఓ కోటయ్య, రైతులు పందిరి వెంకటరెడ్డి, వేపూరి సుదీర్ కుమార్, కాసాని వెంకన్న, ఎలకా రామిరెడ్డి, దేవరంగుల నాగభూషణం, ఎలకా సంజీవరెడ్డి, బోళ్ళ సీతారామరెడ్డి, శ్రీరాముల శ్రీనివాస్, మల్లికంటి శ్రీహరి, కాటేబోయిన సోమయ్య, గుండు రమేష్, మేకల శ్రీనివాస్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి సాగర్లో స్వాగతం
పలుకుతున్న నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## కృష్ణా నది తీరంలో ప్రశాంతంగా ముగిసిన వరుణ యాగం

- 108 రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరైన మంత్రులు కోమటిరెడ్డి , ఉత్తమ్, కొండా సురేఖ

**నల్లగొండ --ఆగష్టు 10 (మనం ప్రతినిధి ):** దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ వద్ద కృష్ణా నది ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుండి వచ్చిన 108 మంది రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 4 గంటల 5 నిమిషాలకు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమైంది.ఈ వరుణయోగం సోమవారం సాయంత్రం 3 గంటల 24 నిమిషాలకు పూర్ణాహుతితో ముగిసింది. ఋత్వికులు, అర్చకులు గోపూజతో యాగాన్ని ప్రారంభించి, యాగ ప్రదక్షిణము, పుణ్యా వచనం, అంకురార్పణం,ఋష్యశృంగ పూజ, తదితర పూజలతో వేదమంత్రాల మధ్య సాగిన వరుణయాగం వర్షాలు సమృద్ధిగా కురవాలని నిర్వహించడం జరిగింది. కృష్ణానది ఒడ్డున చతుర్విధ పారాయణం తో నిర్వహించిన ఈ యాగం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దంపతులు పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో, యాగశాల వద్దకు మేళా తాళాల తో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి దంపతులు వరుణ యాగం లో పాల్గొని పూర్ణాహుతి గావించి యాగాన్ని ముగించారు. అంతకుముందు సాగర్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి బి సి సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, పలువురు. ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ లు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ వరుణ యాగంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,మరో విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు శంకర్ నాయక్,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి ,ప్రభుత్వ సలహాదారు లు కే కేశవ రావు ,సుదర్శన్ రెడ్డి ,మాజీ మంత్రి జనా రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్,ఎస్ పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎం ఎల్ ఏ కుందూరు జయవీర్ రెడ్డి, ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, మిర్యాల గూడ, దేవరకొండ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి , బాలునాయక్, కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, మిర్యాలగూడ ఆర్ డి ఓ రమణా రెడ్డి,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి నెలకు 5,000 పెన్షన్ ఇవ్వాలి

- గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య డిమాండ్

**నేరేడుచర్ల ఆగస్టు 10 మనం న్యూస్ :** 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి నెలకు 5000 రూపాయల పెన్షన్ అందించాలని గీత పనివారల సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో గీత పనివారల సంఘ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు పూర్తయిందని కొత్త పెన్షన్లు త్వరలోనే మంజూరు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద గీత పరివారలకు అర్హత కలిగిన అందరికీ సంఖ్యతో సంబంధం లేకుండా 50 ఏళ్లు నిండితే తక్షణమే పెన్షన్ అందించి వారికి అండగా ఉండాలని ఆయన కోరారు రాష్ట్ర ప్రభుత్వం అందించే పెన్షన్ కొరకు వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని ప్రస్తుత పరిస్థితిలో 50 ఏళ్లు పైబడిన వారు తాటి చెట్టు ఎక్కే పరిస్థితి లేదని అందువల్ల వారికి వేరే వృత్తి రానందువల్ల కుటుంబ జీవనం కొరకు కనీసం నెలకు 5000 రూపాయల పెన్షన్ తో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అలాగే వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారి కుటుంబాల్లోని వారికి ఉచిత విద్య ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు గీత కార్మికుడు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షల రూపాయలు ఎక్స్రేషియా ఇవ్వాలని అతని భార్యకు 5000 పెన్షన్ అందించాలని ప్రతి సొసైటీ కి మరియు టిఎప్టి కి తాటి ఈత వనాలు పెంచేందుకు ఐదు ఎకరాల ప్రభుత్వం భూమిని కేటాయించాలని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లాకు ఒకటి చొప్పున నీరా కేంద్రాలు ఏర్పాటు చేసి గీత కార్మికులకు జీవన ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు సభ్యత సేకరణ కార్యక్రమంలో గీత పనివారాల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాలకూరి బాబు జై గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పు లక్ష్మీనారాయణగౌడ్ గీత పనివారల సంఘం నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ ముత్యాల భాస్కర్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్ అన్నారు.

## కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏటూరునాగారంలో రాస్తారోకో

**ఏటూరునాగారం, ఆగస్టు 10: మనం ప్రతినిధి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్ భరో కార్యక్రమంలో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఏటూరునాగారం ఎంపీడీవో కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వై జంక్షన్ వరకు చేరుకుని, అనంతరం జాతీయ రహదారి 163పై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విరమించాలి, కార్మిక, రైతు హక్కులను కాపాడాలి, కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి అంటూ నినదించారు. రాస్తారోకో కారణంగా జాతీయ రహదారి 163పై భారీగా వాహనాలు నిలిచిపోయి కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమం సందర్భంగా ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాస్తారోకోను విరమించాలని పోలీసులు పలుమార్లు సూచించినప్పటికీ ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగించారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి ఏటూరునాగారం పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.డి. దావూద్ మాట్లాడుతూ..₹. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి



కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను బలహీనపరిచే విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపే విధానాలను ఉపసంహరించుకుని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాలు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాయని ఎం.డి. దావూద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్పీ ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జాగటి చిన్న, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కోరం చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాగటి రవితేజ, టిఎల్ రవి, పాటల గోపి, సరిత, వినోద, స్వరూప, రాజ్యలక్ష్మి, కాసింబి, సుమలత, లక్ష్మీనరసమ్మ, ఏం పార్వతి, సూరమ్మ, శ్రావ్య, నగేష్, పాషా, పాప, రాజ్యలక్ష్మి, రమాదేవి, కమల, నసీరుద్దీన్ 200 కార్మికులు పాల్గొన్నారు

## లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్గా మహదేవ్

**సూర్యాపేట సూర్యాపేట ఆగష్టు 10 (మనం ప్రతినిధి)** సూర్యాపేట లయన్స్ ఐ హాస్పిటల్ నూతన చైర్మన్గా ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం లయన్స్ ఐ హాస్పిటల్లో నిర్వహించిన కార్యక్రమంలో మహదేవ్ నూతన చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లయన్స్ ఐ హాస్పిటల్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల సునీల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా



తోట శ్యామ్ ప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్స య్య, సంయుక్త కార్యదర్శిగా ఈగ దయాకర్ గుప్త ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, భోనగిరి భాస్కర్, చల్లా లక్ష్మీకాంత్, బెలి దె అంజయ్య, మిర్యాల సుధాకర్, కుమ్మరికుంట్ల లింగ య్య, ఆరె సురేష్ రెడ్డి, పటేల్ నర్సింహా రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, ధర్మారావు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదా రులుగా గుణగంటి రాములు, మొరిశెట్టి లక్షాది, గుడిపూడి వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# మేడారం ఆలయ తుదిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**అధికారుల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డ దనసరి అనసూయ సీతక్క**



**ములుగు, ఆగస్టు 10 ,మనం ప్రతినిధి:** మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న ఏర్పాట్లను, ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులను పరిశీలించిన మంత్రి, వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 16వ తేదీన పర్యటించనున్న సందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**వరంగల్, ఆగస్టు 10: (మనం ప్రతినిధి ):** వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా విచ్చేసినరాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం హనుమకొండలోని ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# తలసేమియా చిన్నారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచింది: మంత్రి పొంగులేటి



- **తలసేమియా బాధిత కుటుంబాలకు భరోసా**
- **ప్రతి చిన్నారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**హనుమకొండ ఆగస్టు 10(మనం ప్రతినిధి ):** హనుమకొండ: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు, వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు రక్తం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. హనుమకొండలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి పొంగులేటి గారు.ఈ సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి ప్రస్తావించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్నది చిన్నారులు మాత్రమే కాదని, వారి కుటుంబ సభ్యులు కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా బాధితుల కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా ఇప్పటికే సుమారు 235 మంది దరఖాస్తు చేసుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల మందికి పైగా ఈ సహాయం అందే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. వికలాంగుల కోటాకు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలిపారు.తలసేమియా చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని మంత్రి మనస్ఫూర్తిగా స్వాగతించారు. గతంలో అనేకసార్లు దరఖాస్తులు చేసినప్పటికీ పరిష్కారం కాని సమస్యలకు ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని పేర్కొన్నారు. రక్తం ఎక్కడ పడితే అక్కడ డబ్బులు చెల్లించి కొనుగోలు చేయలేమని మంత్రి అన్నారు. రక్తదానం చేస్తున్న ప్రతి దాతను రాష్ట్ర ప్రభుత్వం తరఫున మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి తలసేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ప్రభుత్వం భవిష్యత్తులోనూ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైన కుటుంబాలకు ఇళ్ల సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల ద్వారా ఇళ్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు శ్రీ కేఆర్ నాగరాజు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, తలసేమియా బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, రక్తదాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

- **రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో**
- **స్తంభించిన ట్రాఫిక్ - నాయకులను అరెస్టు చేసిన పోలీసులు**

**వరంగల్ ఆగస్టు 10(మనం ప్రతినిధి ):** స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు,లేబర్ కోడ్స్ లాంటి వినాశనకర విధానాలతో రైతులను కార్మికులను అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి సుధమల్ల భాస్కర్ వల్లందాస్ కుమార్, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి పాశం రవి, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐసీసీటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి హెచ్చరించారు. ఈరోజు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకొని రాస్తారోకో చేస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆందోళనను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎస్కెయం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు కార్మిక సంఘాల బాధ్యుడు గంగుల దయాకర్ అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదం పేరు చెప్పి ఆచరణలో అమెరికా లాంటి విదేశాలకు అనుకూలంగా విధానాల రూపకల్పన చేసి స్వదేశీ వ్యవసాయాన్ని రైతులను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా కార్మికులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులతో పండిన పంటలకు సరైన మార్కెట్



సౌకర్యం లేక గిట్టుబాటు ధర రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా 32 దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకొని అక్కడి ఉత్పత్తులను మనదేశంలోకి అనుమతించడం దారుణం అన్నారు. అమెరికా లాంటి దేశంలో రైతులకు అనేక సబ్సిడీలు రాయితీలు అందించి ప్రోత్సహిస్తుంటే మనదేశంలో మాత్రం అందు విరుద్ధంగా ఉందన్నారు ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. అలాగే రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మద్దతు ధర రుణ విముక్తి చట్టం చేయాలని కేంద్ర విద్యుత్తు విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబరు కోడ్స్ ను తక్షణమే రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. లేకపోతే రైతులు కార్మికులు ఐక్యంగా ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య నర్ర ప్రతాప్ నెట్టెం నారాయణ చుంచు జగదీశ్వర్ మాలోతు సాగర్ పుల్ల రమేష్ ఓదెల రాజన్న బండి వెంకటేశ్వర్లు హంసల్ రెడ్డి బొల్లు ఎల్లయ్య ఎంఏ పాషా చుక్క శోభ పూలక్కా పిడి ఎస్ యు పృధ్వి నర్సింగం బాబు రామస్వామి చిన్న రాజేందర్ ఐలయ్య ఎగ్గని మల్లికార్జున్ మాలి ప్రభాకర్ గణిపాక ఓదేలు అప్పనపుడి నరసయ్య నలివెల రవి సుమంత్ చారిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు ప్రజా పోరాటాలు ఆగవు

**పర్వతగిరి, ఆగస్టు 10 (మనం న్యూస్):** దేశవ్యాప్త జైలుభోరో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రధాన రహదారి అంబేద్కర్ సెంటర్లో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. నకరకంటి రామచందర్ అధ్యక్షతన సీఐటీయూ మండల కన్వీనర్ జిల్లా రమేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రామచందర్, జిల్లా నాయకురాలు గజ్జల మౌనిక మాట్లాడుతూ కేంద్రంలోజి బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశార కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన బిల్లులను వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని వివిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలన్నారు. విత్తన సవరణ బిల్లును రద్దుచేసి విద్యుత్ సంస్కరణ బిల్లు మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జిల్లా రమేష్ రాపాకా భాస్కర్, ఆబర్ల ఎల్లయ్య, కొయ్యల ప్రభాకర్, కొమ్ము దగ్గయ్య, సాగరం నిర్మల, లక్క శ్రీరామ్, మాసాని పూల, కల, మాలోతు నీ మూడు రెడ్యా, ఇస్లావత్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ ఏఆర్ఎస్ఐ గుండెపోటుతో మృతి

**హనుమకొండ ఆగష్టు 10(మనం ప్రతినిధి ):** వరంగల్ కమిషరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎస్. శామ్యూల్ (57) ఈ రోజు ఉదయం సమయంలో హనుమకొండలోని ప్రకాశ్ రెడ్డి పేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు. ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్రప్రభుత్వం

- **రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం**
- **రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి**
- **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి**

**హనుమకొండ, ఆగస్టు 10: (మనం ప్రతినిధి ):** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్రెడ్డి, రేవూరి ప్రకాశ్రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. యాసంగి సీజన్లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, ఆ జ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు. శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని మంత్రి అన్నారు.

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ మాట్లాడుతూ**

జిల్లా స్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేలో 87.19 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్

**వరంగల్, ఆగస్టు 10: (మనం ప్రతినిధి ):** వరంగల్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఖిఐఖ) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియలో గణనీయమైన పురోగతి నమోదైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఆగస్టు 10 ఉదయం 7.59 గంటల వరకు జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 7,76,953 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. మొత్తం 795 మంది బీఎల్ఓల ద్వారా 100 శాతం ఫారాలు పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయింది. ఇప్పటివరకు 6,77,412 ఎలక్షన్ ఫారాలు డిజిటలైజ్ చేసి 87.19 శాతం ప్రక్రియను పూర్తి చేశారు. నియోజకవర్గాల వారీగా నర్సంపేటలో 92.36 శాతం, వరంగల్ తూర్పులో 80.22 శాతం, వర్ధన్నపేటలో 89.26 శాతం డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. 6,77,286 ఫారాలను బీఎల్ఓలు వెరిఫై చేయగా, 18,110 ఫారాలను ఓటర్లు స్వయంగా సమర్పించారు. 99,541 ఫారాలు (12.81 శాతం) డబుల్ ఓటర్లు చనిపోయిన, షిఫ్టెడ్ అయిన ఓటర్లుగా గుర్తించడమైనదని, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# కళ్యాణం... కడు రమణీయం..

- **నేత్రపర్వంగాశ్రీ వెంకటేశుని కళ్యాణం**
- **వైభవంగా మహా సుదర్శన యాగం**

**హనుమకొండ, ఆగస్టు 10 ( మనం ప్రతినిధి):** భీమారం సమీపంలోని జగతి గార్డెన్స్ వేదికగా ఆదివారం శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. హనుమకొండ జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు హరిపురం సునంద, ప్రధాన కార్యదర్శి పరాంకుశం దయాకర్ల,కార్యవర్గం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం అభినందనీయం. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించబడిన భారీ వేదికపై ఉత్సవ విగ్రహాల నుంచి వైభవంగా కళ్యాణ తంతును నిర్వహించారు. ఏకశిలా పార్క్ సమీపంలోని ప్రసన్నాంజనేయ శ్రీ రామాలయ ప్రధానార్చకులు డింగరి శ్రీనివాసచార్య, ప్రముఖ యజుర్వేద పండితుడు గుడిమల్ల విజయకుమార్ ఆచార్యుల యాగ్నీకంతో కళ్యాణం జరిగింది. అంతకుముందు లోక కళ్యాణార్థం వైభవంగా శ్రీ మహా సుదర్శన యాగాన్ని కూడా నిర్వహించారు. చాత్తాద శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ అపురూప వేడుకల్లో




165జంటలు కళ్యాణోత్సవంలో పాల్గొనడం విశేషం. హనుమకొండ జిల్లా శాఖ టాప్... ఆటు,సంఘ కార్యకలాపాలతో పాటు,.. సామాజిక సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంలో రాష్ట్రంలోనే హనుమకొండ జిల్లా టాప్ గా ఉందని, రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ కితాబిచ్చారు. తాను హనుమకొండ జిల్లా శాఖకు 25వేల రూపాయలను విరాళా గా ప్రకటించారు.. చాత్తాద శ్రీ వైష్ణవ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ సాంప్రదాయ కార్యదర్శి, పుల్లకండం ఉపేంద్ర స్వామి ఈ వేడుకల్లో పాల్గొంటూ తన జన్మదిన వేళ.. అద్భుత కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందంటూఅయిదు వేల రూపాయలను విరాళంగా అందించారు.. రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు టి రవికుమార్, తులసి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకట యోగి వెంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లా నాయకులు సతీ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు.

# వరంగల్ ఐటీఐకి 'హబ్'గా అప్ గ్రేడ్ చేయాలి

- **పీఎం-సేతు కింద హాస్టల్ మంజూరు చేయండి**
- **కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినతి**

**హనుమకొండ ఆగష్టు 10(మనం ప్రతినిధి ):** వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం-సేతు పథకం కింద 'స్పోక్' నుంచి 'హబ్'గా అప్గ్రేడ్ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. 1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం సుమారు 1,402 మంది శిక్షణ పొందుతున్నారని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున సంస్థను ఆధునిక సౌకర్యాలతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, ఎస్సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట-వరంగల్ రైల్వేతో పాటు ఇతర పారిశ్రామిక రంగాల విస్తరణతో భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని కడియం కావ్య వివరించారు. ఐటీఐని హబ్గా అభివృద్ధి చేస్తే ఆధునిక సాంకేతిక పరికరాలు, పరిశ్రమలకు అవసరమైన కోర్సులు, అప్రెంటిస్షిప్, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఐటీఐని హబ్గా, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, మహబూబాబాద్లోని సంబంధిత సంస్థలను స్పోక్లుగా అభివృద్ధి చేయాలని ఎంపీ ప్రతిపాదించారు. దీనివల్ల ఉమ్మడి ప్రాంతంలో నైపుణ్య శిక్షణను సమన్వయంతో విస్తరించి, అధిక సంఖ్యలో యువతకు ఆధునిక శిక్షణ అందించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం ప్రత్యేక హాస్టల్ సదుపాయం లేదని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నిత్యం సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీఎం-సేతు కింద ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పిస్తున్న



నేపథ్యంలో విద్యార్థుల వసతి, భోజనం, పారిశుద్ధ్యం, చదువు తదితర సౌకర్యాలతో కూడిన హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. వరంగల్ ఐటీఐని హబ్గా అప్గ్రేడ్ చేయడంతో పాటు హాస్టల్ భవనానికి ప్రాధాన్యం ఇచ్చి మంజూరు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# రెహమాన్‌కుమారుడికి గాయాలు

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ కుమారుడు, గాయకుడు అమీన్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. చెన్నైలో అమీన్ తన స్నేహితుడు భార్గవ్ తో కలసి కారులో వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ట్యాక్సీ వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అమీన్, భార్గవ్ తో పాటు ట్యాక్సీ డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వారు ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం డిశ్చార్జి అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



40 ఎకరాల బీడు భూమి..

# అత్యాధునిక క్రికెట్ శిక్షణ కేంద్రంగా రూపాంతరం!

గత కొద్ది రోజులుగా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పేరు మార్మోగుతోంది. ఆటగాళ్ల గాయాల విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఈ సీవోఈను బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, బోర్డు అధికారులు సందర్శించారు. సీవోఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్రీడాకారులకు అన్ని సదుపాయాలను కల్పించడంలో లక్ష్మణ్ కృషి అభినందనీయం. అయితే, దాదాపు 40 ఎకరాల బంజరు భూమిని సకల సదుపాయాలతో కూడిన 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'గా తీర్చిదిద్దడంలో బీసీసీఐ మాజీ కార్యదర్శి.. ప్రస్తుత ఐసీసీ ఛైర్మన్ జై షా పాత్ర అత్యంత కీలకం. ఇదే విషయాన్ని తాజాగా బీసీసీఐ కార్యదర్శి సైకియా, సీవోఈ హెడ్ లక్ష్మణ్ గుర్తు చేసుకున్నారు.

''సీవోఈ ఇంత స్థాయిలో అభివృద్ధి కావడానికి జై షా వేసిన అడుగులే కారణం. కార్యదర్శిగా ఉన్నప్పుడు.. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్లో అందరితో చర్చించి ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆయనదే కీలక పాత్ర. యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పట్టుబట్టారు. పాత జాతీయ క్రికెట్ అకాడమీ స్థానంలో అద్భుతమైన సదుపాయాలు కలిగిన ఎక్సెలెన్స్ సెంటర్ను నిర్మించాం. ప్రాజెక్టును ప్రారంభించే క్రమంలో చాలా నిబంధనలను పాటించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎదురైన చట్టపరమైన అడ్డంకులను తొలగించడానికి జై షా వ్యక్తిగతంగా చాలాసార్లు ఇక్కడికి వచ్చారు. దాదాపు 40 ఎకరాల బీడు భూమిని క్రమబద్ధీకరించుకొనే క్రమంలో సవాళ్లు ఎదురయ్యాయి. నిరుపయోగంగా ఉన్న ఈ భూమిని తిరిగి తీసుకోవాలని కొందరు స్థానికులు భావించారు. మేం అనుకొన్న సమయానికి పనిని ప్రారంభించడానికి ల్యాండ్ ప్రక్రియ అడ్డంకిగా మారింది. అప్పుడు జై షా కృషి మరువలేనిది. అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఇబ్బందులను తొలగించి మార్గం సుగమం చేశారు'' అని దేవజిత్ గుర్తు చేసుకున్నారు.

**రెండేళ్లలోనే..**

''కేవలం రెండేళ్లలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ సెంటర్ సిద్ధం చేయగలిగాం. ఇందులో ఎక్కువ క్రెడిట్ జై షాదే. ఈ ప్రాజెక్టు పట్ల చాలా ఆసక్తి చూపించారు. ఆర్కిటెక్ట్స్, ఎల్ అండ్ టీ టీమ్తో నిరంతరం



సంప్రదింపులు జరిపారు. ఇదంతా నేను దగ్గర నుంచి చూశా'' అని వీవీఎస్ లక్ష్మణ్ తెలిపాడు. 2022 ఫిబ్రవరి 14న ఈ నిర్మాణ పనులు ప్రారంభించగా.. 2024 నవంబర్ లో సీవోఈ కార్యకలాపాలు మొదలైన సంగతి తెలిసిందే.



# గౌతమ్ గంభీర్ రికార్డుపై కన్నేసిన రవీంద్ర జడేజా

టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా దాదాపు 8 నెలల తర్వాత తిరిగి జాతీయ జట్టు తరపున ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులో జడేజా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్ కు ముందు జడేజాను పలు అరుదైన రికార్డులు ఊరిస్తున్నాయి.

**జడేజా ముందున్న రికార్డులు ఇవే**

ఈ మ్యాచ్ లో జడేజా మరో రెండు వికెట్లు పడగొడితే టెస్టుల్లో 350 వికెట్లు మైలు రాయిని అందుకున్న ఐదో భారత బౌలర్ గా నిలుస్తాడు.

అదేవిధంగా మరో 4 వికెట్లు సాధిస్తే శ్రీలంకపై టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో ఐదో స్దానానికి చేరుకుంటాడు. ప్రస్తుతం ఈ రికార్డు వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ పేరిట ఉంది. ఇషాంత్ శర్మ 12 టెస్టుల్లో 36 వికెట్లు తీయగా, జడేజా 7 టెస్టుల్లోనే 23.72 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.

ఈ జాబితాలో అనిల్ కుంబ్లే (74 వికెట్లు), రవిచంద్రన్ అశ్విన్ (62), హర్భజన్ సింగ్ (53), కపిల్ దేవ్ (45) మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు.

దేవిధంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ రికార్డుపై కూడా అతడు కన్నేశాడు. మరో 60 పరుగులు చేస్తే టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో గంభీర్(4,154)ను జడ్డూ అధిగమిస్తాడు. కాగా జడేజా మంచి టచ్ లో ఉన్నాడు. శ్రీలంక ఎలెవన్తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్ లో జడేజా బ్యాట్ తో పాటు బంతితో కూడా రాణించాడు.

# 'కొరటాల - బాలయ్య' సినిమాపై కొత్త అప్‌డేట్?

కొరటాల శివ దర్శకత్వంలో బాలయ్య బాబు హీరోగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఐతే, మొదట ఈ నెల మూడో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ను స్టార్ట్ చేయాలని ప్లాన్ చేసినా.. బాలకృష్ణకు మోకాలి గాయం కావడంతో షెడ్యూల్ రద్దు అయింది. ఐతే సెప్టెంబర్ సెకండ్



వీక్ నుంచి ఈ సినిమాకు సంబంధించి ఒక కీలకమైన షెడ్యూల్ మొదలుకానుందని తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో బాలయ్య లేని సన్నివేశాలను తీయబోతున్నారని తెలుస్తోంది. కేవలం ఈ షెడ్యూల్ కోసమే సుమారు 15 రోజులకు పైగా షూటింగ్ సాగనుంది. అన్నట్టు ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. దేవర తర్వాత కొరటాల శివ చేస్తున్న సినిమా కావడంతో.. కథ పై కొరటాల బాగా కసరత్తులు చేశారట. కాగా సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# సీఎస్కే హెడ్ కోచ్‌గా బ్రెండన్ మెక్ కల్లమ్!

ఐపీఎల్-2027 సీజన్ కు ముందు చెన్నై సూపర్ సూపర్ కింగ్స్ తమ కొత్త హెడ్ కోచ్ కోసం వేట ప్రారంభించింది. హెమాంగ్ బదానీ, రవిచంద్రన్ అశ్విన్, రాహుల్ ద్రవిడ్ వంటి భారత మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలోకి వచ్చినప్పటికీ.. సీఎస్కే మాత్రం విదేశీ హెడ్ కోచ్ కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది. స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో మరో న్యూజిలాండ్ లెజెండ్ బ్రెండన్ మెక్ కల్లమ్ ను తమ జట్టు ప్రధాన కోచ్ గా ఎంపిక చేయాలని సీఎస్కే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా మెక్ కల్లమ్ ఇటీవల ఇంగ్లండ్ టెస్టు జట్టు హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకొన్న సంగతి తెలిసిందే. అయితే అతడు ఇంగ్లీష్ జట్టు వైట్ బాల్ కోచ్ గా మాత్రం కొనసాగుతున్నాడు. త్వరలోనే ఈ పదవి నుంచి కూడా అతడు వైదొలిగే అవకాశమున్నట్లు పలు రిపోర్ట్ లు పేర్కొంటున్నాయి. ఇకపై అతడు ఫ్రాంచైజీ క్రికెట్ పై దృష్టిసారించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది.



కాగా మెక్ కల్లమ్ కు సీఎస్కేతో మంచి అనుబంధం ఉంది. అతడు ఫ్లెమింగ్ నాయకత్వంలో సీఎస్కే తరపున ఆడాడు. ఈ నేపథ్యంలోనే అతడిని తమ కోచ్ గా నియమించాలని నియమించాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. కానీ దీనిపై సీఎస్కే నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసుకోవడానికి కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్ తో పాటు సీఎస్కే కూడా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఫ్రాంచైజీ పూర్తి దృష్టి హెడ్ కోచ్ ఎంపికపైనే ఉందంట. కోచ్ ఎంపిక ఖారారైన తర్వాతే పాండ్యాపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.



# షార్ట్ నిక్కర్‌లో ప్రగ్యా జైస్వాల్

మోస్ట్ హాటెస్ట్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇప్పటివరకు పలు తెలుగు చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కమర్షియల్ సినిమాల్లో తన అందాలతో యువతను ఆకట్టుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫొటోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది. దీంతో సోషల్ మీడియాలో ప్రగ్యా జైస్వాల్ కు ఉన్న ఫాలోయింగ్ కూడా రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ బ్యూటీ మరోసారి తన గ్లామర్ ట్రీట్తో కుర్రకారును కట్టిపడేసింది. వైట్ కలర్ పొట్టి నిక్కర్ కు మ్యాచింగ్ టీ షర్ట్ ధరించిన ప్రగ్యా.. సోఫాపై డిఫరెంట్ యాంగిల్స్ లో కూర్చొని ఫొటోలకు పోజులిచ్చింది. తన గ్లామరస్ లుక్ హైలైట్ అయ్యేలా ఇచ్చిన ఈ స్టిల్స్ లో ప్రగ్యా జైస్వాల్ మరింత హాట్ గా కనిపించింది.

దీంతో ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# 'ఇంద్రపుత్ర'గా కిరణ్ అబ్బవరం.. టైటిల్ ఫిక్స్!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ' విజయానందంలో ఉన్నారు. ఐతే, తన కెరీర్ లోనే భారీ బడ్జెట్తో రూపొందే ఓ పౌరాణిక చిత్రం కోసం ఆయన ప్రేరణ అరోరా మరియు జీ స్టూడియోస్తో జతకట్టారన్న విషయం తెలిసిందే. ఐతే, ఈ చిత్రానికి 'ఇంద్రపుత్ర' అని పేరు పెట్టినట్లు చిత్ర బృందం తాజాగా అధికారికంగా ప్రకటించింది. 'కాంతార: చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల ఈ పాన్-ఇండియా చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్లో ప్రారంభం కానుంది. కీర్తన్ సహ-నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం, నిర్మాతలు ప్లాన్ చేస్తున్న పౌరాణిక ప్రపంచంలో మొదటి భాగం కానుంది. ఇక ఈ సినిమాకి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు మరియు ప్రాజెక్ట్కు సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే రోజుల్లో వెల్లడి కానున్నాయి.



# 'అగధ' కేవలం హారర్ మాత్రమే కాదు.. - నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి

టాలీవుడ్ సీనియర్ నిర్మాత ఎమ్.ఎస్.రాజు కొంత లాంగ్ గ్యాప్ తర్వాత దర్శకత్వ బాధ్యతలు చేపట్టి తెరకెక్కించిన లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్ను హైదరాబాద్లో తాజాగా నిర్వహించారు. ఈ వేడుకలో ప్రముఖ నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 'అగధ' చిత్రం తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్.ఎస్. రాజుతో తనకున్న 45 ఏళ్ల అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''సినిమా కథనంపై పూర్తి పట్టు సాధించిన ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఆయన. ఇప్పుడు 'అగధ' అనే డిఫరెంట్ కాన్సెప్ట్తో వస్తున్నారు. ట్రైలర్ విజువల్స్, సంగీతం, ఎడిటింగ్ అద్భుతంగా ఉన్నాయి. ఇది కేవలం భయపెట్టే హారర్ సినిమా మాత్రమే కాదు.. మంచి ఎమోషన్స్, థ్రిల్లింగ్ సన్నివేశాలతో కూడిన గొప్ప అనుభూతినిచ్చే చిత్రం అవుతుంది' అని శ్యామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. అలాగే, కామాక్షి భాస్కర్ల స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాను ముందుండి నడిపిస్తుందని, చిత్రబృందానికి పెద్ద విజయం దక్కాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# 'కొరియన్ కనకరాజు'.. గ్రాండ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా చిరంజీవి!

మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన 'కొరియన్ కనకరాజు' చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హారర్ కామెడీ ఎంటర్ టైనర్ ను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్మెంట్స్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని చిత్రయూనిట్ 'మెగా బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్' పేరుతో సక్సెస్ మీట్ ను నిర్వహిస్తోంది. ఆగస్టు 11 సాయంత్రం 4 గంటల నుంచి హైదరాబాద్ లోని ఐటీసీ కోహినూర్ హోటల్ లో ఈ వేడుక జరగనుంది.

**ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి**

ఈ గ్రాండ్ ఈవెంట్ కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వరుణ్ తేజ్ తో పాటు చిత్ర బృందాన్ని నేరుగా అభినందించేందుకు ఆయన ఈ వేడుకకు వస్తుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. రాయలసీమ నేటివిటీకి కొరియన్ ఫాంటసీ అంశాలను జోడించి దర్శకుడు మేర్లపాక గాంధీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో వరుణ్ తేజ్ నటనతో పాటు సత్య కామెడీ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ విజయోత్సవ వేడుక ద్వారా చిత్రబృందం తమ ఆనందాన్ని అభిమానులతో పంచుకోనుంది.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.